ప్రజాశక్తి
గురువారం 16 మార్చి 2023
5
కర్నూలు





ఆర్‌ఎంపి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న బాధితులు

ఈసారైనా ఇస్తారా..?

- జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు - ముందుకు కదలని నీటి పథకాలు - ఈ బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు కదలడం లేదు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడంతో ఏ ప్రాజెక్టూ ముందుకు సాగడం లేదు. చాలా ప్రాజెక్టులు శంకుస్థాపనకే పరిమితం అయ్యాయి. గురువారం రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈ సారైనా జిల్లా ప్రాజెక్టులకు నిధులు ఇస్తారా? లేదా? అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు....



గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. రాయలసీమకు ఆధారంగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అభివృద్ధికి ఎటువంటి కేటాయింపులూ చేయలేదు. జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టుల అంచనాలను పక్కనబెట్టి మొక్కుబడిగా నిధులు కేటాయించారు.

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగేలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరదవస్తేనే కాలువకు సాగునీరు అందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలి ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాకా ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడిఆశలయ్యాయి.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరువుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.

వలస నివారణ చర్యలు శూన్యం

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 40వేల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకూ ఏ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

వైద్యం వికటించి బాలుడు మృతి

- ఆర్‌ఎంపి ఇంటి వద్ద బాధితుల ఆందోళన

ప్రజాశక్తి - కోసిగి రూరల్

వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం కోసిగి మండలంలో చోటు చేసుకుంది. అధిక డోస్ ఉన్న ఇంజెక్షన్లు వేయడం వల్లే తమ పిల్లవాడు చనిపోయాడని బాలుని తల్లిదండ్రులు, బంధువులు ఆర్‌ఎంపి పార్లపలి లక్ష్మీ నారాయణను నిలదీశారు. ఆర్‌ఎంపి ఇంటి ముందు భారీ ఎత్తున కేకలు వేస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతి చెందిన బాలుని తల్లిదండ్రులకు సర్ది చెప్పి, ఆర్‌ఎంపి డాక్టర్ పార్లపల్లి లక్ష్మీ నారాయణను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కోసిగిలోని 3వ వార్డుకు చెందిన పందికోన చిన్న ఈరన్న, సునీతకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో చిన్నవాడు నవీన్ (4)కు 15 రోజుల నుంచి ఆరోగ్యం బాగా లేకపోతే ఆర్‌ఎంపి లక్ష్మీ నారాయణ వద్ద వైద్యం చేయిస్తున్నారు. ఎన్ని రోజులైనా పిల్లవాడికి తగ్గకపోవడంతో, ఆర్‌ఎంపి డాక్టర్ పార్లపల్లి లక్ష్మీ నారాయణ రక్త పరీక్ష చేయించారు. బాలునికి టైఫాయిడ్ ఉందని, ఎవరూ కంగారు పడక్కర్లేదని 15 రోజుల నుంచి ఆర్‌ఎంపి డాక్టర్ వైద్యం చేశారు. బాలునికి ఎన్ని రోజులైనా జ్వరం తగ్గకపోవడంతో మంగళవారం ఉదయం ఆదోనిలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. గత 15 రోజుల నుంచి ఓ ఆర్‌ఎంపి వైద్యుడు చికిత్స చేశారని, తల్లిదండ్రుల దగ్గర ఉన్న ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్లు ఆదోనిలోని ప్రయివేట్ వైద్యునికి చూపించారు. 'మీ పిల్లవాడి పరిస్థితి బాగా లేదు. అధిక డోస్ ఉన్న ఇంజెక్షన్లు ఎవరు వేశారు. ఆర్‌ఎంపి డాక్టర్ వద్ద ఎందుకు చూపించారు. కర్నూలుకు తీసుకెళ్లండి. బాలుని పరిస్థితి విషమంగా ఉంద'ని వైద్యులు తేల్చిచెప్పారు. మెరుగైన వైద్యం కోసం బాలుడిని ఆదోని నుంచి కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో బాలుడు మృతి చెందాడు. బాలునికి గత 15 రోజుల నుంచి బాగు చేస్తానని, డబ్బులకు కక్కుర్తి పడి అధిక డోస్ ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్లు ఇచ్చి తమ పిల్లవాడి మృతికి ఆర్‌ఎంపి వైద్యుడే కారణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తన వల్ల కాకపోతే 15 రోజుల ముందే చెప్పి ఉంటే ఆదోని ప్రయివేట్ ఆస్పత్రిలో తమ పిల్లవాడికి చూపించి బాగు చేసుకునే వారమని బాలుని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తమ పిల్లవాడి మృతికి కారణమైన ఆర్‌ఎంపి వైద్యునిపై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితులు కోసిగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ నిమిత్తం ఆర్‌ఎంపి వైద్యుని పోలీసులు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహిళల ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ నుండి రాజ్ విహార్ గాంధీనగర్ మీదుగా జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం ముందు శ్రామిక మహిళా సంఘం నాయకులు రమిజాబి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. 50 శాతం మహిళలు ఉన్నప్పటికీ చట్టా సభల్లో మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉందని, తక్షణమే చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావాలన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. రోజు ఏ ఛానల్ చూసినా ఏ న్యూస్ పేపర్ చూసిన మహిళల పైన దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, మానభంగాలు జరుగుతున్నట్టు తెలుస్తుందన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని అన్నారు. ఐద్వా సీనియర్ నాయకులు రత్నమ్మ, ఓల్డ్ సిటీ కార్యదర్శి బంగి పద్మ, డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష మాట్లాడుతూ దిశా నిర్భయ యాప్‌లు, చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని తెలిపారు. ఐద్వా జిల్లా నాయకులు కెఎస్.పద్మ, పిఎస్.సుజాత, అమీనా, నగర నాయకులు సావిత్రి, రేవతి, షేకున్, కృష్ణవేణి, విజయ, రుద్రమ్మ, సిఐటియు శ్రామిక మహిళ సంఘం నాయకులు వృత్తిదారుల సంఘం నాయకురాలు జయమ్మ, సిఐటియు నగర కార్యదర్శులు సాయిబాబా, విజయ్, నగర అధ్యక్షులు నరసింహులు, భవన నిర్మాణ సంఘం నాయకులు సుధాకరప్ప, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయి, ఉదయ్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్, నగర కార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ

నేడు తేలనున్న మండలి భవితవ్యం

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శాసనమండలి భవితవ్యం గురువారం తేలనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి స్థానంతో పాటు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలకు ఈ నెల 13న పోలింగ్ నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో చేపట్టనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపును కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపును ప్రారంభించనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితం గురువారం మధ్యాహ్నానికి తేలనుంది. స్థానిక సంస్థల స్థానానికి కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయాల్లో, నంద్యాల జిల్లాలో నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 1178 మంది ప్రజాప్రతినిధులకు గాను 1136 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96.43 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల జిల్లాలో 578 మంది ప్రజాప్రతినిధులకు గాను 557 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.37 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 1756 మందికి గాను 1693 మంది ఓటు వేశారు. పట్టభద్రులకు సంబంధించి కర్నూలు జిల్లాలో 71.30 శాతం, నంద్యాల జిల్లాలో 77.03 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులకు సంబంధించి కర్నూలు జిల్లాలో 90.30 శాతం, నంద్యాల జిల్లాలో 94.01 శాతం మంది ఓటు వేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- పరీక్షా కేంద్రంలో జిల్లా కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ వార్షిక సంవత్సర పరీక్షలు బుధవారం నుండి జిల్లాలో ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సర పరీక్షలు మొత్తం కర్నూలు జిల్లాలో 35077 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 33846 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. 1231 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. జిల్లాలో తుగ్గలి లోని పరీక్షా కేంద్రంలో విద్యార్థి మాత్రమే మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డి బార్ అయ్యారు. కర్నూలు నగరంలోని నారాయణ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా నిర్వహణపై అక్కడ ఉన్న సూపరిండెంట్ ఇతర ఉన్నత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి నాలుగు పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేపట్టగా మిగిలిన పలు కేంద్రాల్లో ఫ్లయింగ్ , సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.



నారాయణ కళాశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కెజి.గోవిందరెడ్డి, కెవి.సుబ్బారెడ్డి

కన్నడ యాత్రికులకు ఉచిత వైద్యం

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స మందుల పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కర్ణాటక నుండి శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న యాత్రికులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించామని, ఈ శిబిరం ఐదు రోజులపాటు ఉంటుందని కర్నూలు జిల్లా ఛైర్మన్ డాక్టర్ కెజి.గోవిందరెడ్డి తెలిపారు. వందలాది కిలోమీటర్ల ఒక్క రోజుకు వేలాది మంది కర్ణాటక భక్తులు కాలినడకన రోడ్డు మార్గాన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకొనుటకు వెళ్తున్నారని తెలిపారు. కర్నూలు ఎల్లమ్మ గుడి దగ్గర నందవరం మండలం సోమల గూడూరులో, నల్లమల అడవి ప్రాంతంలో పెద్ద చెరువు దగ్గర, శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో కైలాస ద్వారం నంది మండపం దగ్గర యాత్రికులకు చికిత్సలు చేసినట్లు తెలిపారు. కాళ్లకు బొబ్బలు, గాయాలు, నొప్పులతో బాధపడుతున్న భక్తులకు ప్రథమ చికిత్స చేసి ఉచిత మందులు పంపిణీ చేశామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాలు 20 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ కెవి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాస్ యాదవ్, అరుణ, మధు, ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి , డిఎఫ్ఒ రమేష్ , రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చందన బ్రదర్స్ లో ఉగాది ఉత్సవ్ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో గల చందన బ్రదర్స్ జ్యువలరీస్ అండ్ టెక్స్‌టైల్స్ ఆంధ్రప్రదేశ్ లో ఉగాది సందర్భంగా ఫిబ్రవరి 25 నుండి డిస్కౌంట్ లోడింగ్ పేరుతో ఆఫర్స్ ప్రారంభమయ్యాయని కర్నూలు చందన బ్రదర్స్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాటల్లో.. గత 2 దశాబ్దాలుగా నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా ఎప్పటికప్పుడు కొత్త కలెక్షన్స్ తో కొత్త కొత్త ఆఫర్స్ తో ప్రజల మన్ననలను పొందుతూన్నా చందన బ్రదర్స్ ఈ సంవత్సరంతో 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉగాది సందర్భంగా భారీ ఆఫర్లతో మన ముందుకు వచ్చింది. బంగారు ఆభరణాలపై తరుగు 4.8 శాతం నుంచి ప్రారంభం, ప్రతి 2999 కొనుగోలుపై విలువైన బహుమతులు పొందొచ్చు. వీటితోపాటు 1o1, 1o2 కాంబో ఆఫర్లు. ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్ , కిడ్స్ వేర్‌లో మరెన్నో కాంబో ఆఫర్లు కలవు. చందన బ్రదర్స్ వారి ఈ సువర్ణ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.



కర్నూలు చందనబ్రదర్స్ షోరూమ్

ఉచిత నేత్ర వైద్య శిబిరం జయప్రదం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం లక్ష్మీ నగర్ కు చెందిన సిరి, శ్రీదత్త మహిళ ఐక్యసంఘం ఆధ్వర్యంలో సుశీల నేత్రాలయం వారి సహకారంతో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గంగాధరరెడ్డి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం మద్దూర్ నగర్ పార్క్ తెలుగు తోటలో బుధవారం నిర్వహించారు. సిరి ఐక్యసంఘం ఆర్‌పి ఉమాదేవి అధ్యక్షతన మా తెలుగు తల్లికి మల్లెపులదండపాటతో ప్రారంభ మైన కార్యక్రమంలో కంటి వెలుగులను ప్రసాదించే కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించట అభినందనీయమన్నారు. ఇలాంటి శిబిరాలు పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగమన్నారు. గాడిచర్ల హరి సర్వోత్తమరావ్ ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ కల్కుర, తెలుగు భాష వికాస అభివృద్ధి అధ్యక్షులు జెఎస్ఆర్‌కె శర్మ కంటి ప్రాముఖ్యతను వివరించారు. గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ క్యాంప్ 171వ క్యాంప్ అని ఉచితంగా, మందులు, ఆపరేషన్, రెండు వందల రూపాయలకే కంటి అద్దాలు ఇస్తూ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఇక్కడ ఈ క్యాంపునకు సిరి,శ్రీదత్త ఐక్యసంఘల సహకారంతో నిర్వహిస్తున్నామని ఆర్‌పి ఉమాదేవి తదితరులు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరములో ఓ పీ నిర్వహణలో పద్మజ, ఫరీదా, నిర్మలజ్యోతి కంప్యూటర్ పరీక్ష దగ్గర పి. జ్యోతి రెడ్డి, కంటి పరీక్ష వద్ద కె.సరితా, కంటి అద్దముల నిర్వహణలో, శ్రీదత్త ఐక్య సంఘం కార్యదర్శి కె.ఊర్మిళ, కోశాధికారి, పి.లక్ష్మినారయనమ్మ, ఆర్పీలు బాలలక్ష్మి, రేణుక,రుద్రమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు పి.రమిజాబీ, రజక సంఘం నాయకులు శేషాద్రి, గురుస్వామి, అంజనమ్మ,పుణ్యవతి టిఎల్ ఎఫ్‌హెచ్ ఆర్‌పి కుమారి, లక్ష్మీనగర్, మద్దూర్ నగర్, జోహరాపురం, ముజఫర్ నగర్, అశోక్ నగర్, భగత్ సింగ్ నగర్, ఎస్ ఏ పి క్యాంప్, శరీన్ నగర్ తదితర ప్రాంతల నుండి 215 మంది పాల్గొన్నారు. నేత్రవైద్య నిపుణులు డాక్టర్ సుధాకర్ సుశీల నేత్రాలయా సిబ్బందికి సహకరించిన ప్రజలకు సిరి, శ్రీదత్త తరపున ఆర్‌పి ఉమాదేవి కృతజ్ఞతలు తెలిపారు



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గంగాధరరెడ్డి, మహిళ ఐక్య సంఘం నేతలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్

ఎ 1 ఏజెన్సీని రద్దు చెయ్యాలి

-అకారణంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

-సిఐటియు నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : అవినీతికి పాల్పడుతూ కార్మికులను అకారణంగా తొలగిస్తున్న ఎ1 కాంట్రాక్టు ఏజెన్సీని రద్దుచేసి సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, అవినీతిని ప్రోత్సహిస్తున్న హాస్పిటల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. సిఐటియు నాయకులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన గురువారం హాస్పటల్ గాంధీ విగ్రహం ముందు కార్మికులు ధర్నా చేశారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్, రామకృష్ణ, కృష్ణ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిశుభ్రత కోసం ప్రభుత్వంతో అగ్రిమెంట్ చేసుకున్న ఏ 1ఏజెన్సీ హాస్పటల్ అధికారులతో కలిసి అవినీతి కంపులో కూరుకుపోయిందని తెలిపారు. ఏజెన్సీ వచ్చినప్పటి నుండి అగ్రిమెంటులో ఉన్న జీవో ప్రకారం రూ.16 వేల జీతం ఇవ్వకుండా తక్కువ జీతాలు ఇస్తూ, చైతన్యమై అడుగుతున్న కార్మికులను వేధింపులకు గురి చేస్తూ అక్రమంగా తొలగిస్తున్నారని వారు బాధ వ్యక్తం చేశారు. అగ్రిమెంటులో ఉన్న ప్రకారం తగినంత మంది కార్మికులను పనిలో పెట్టకున్న, కార్మిక చట్టాలు అమలు చేయకుండా ఏజెన్సీ వారు ఇచ్చే మామూళ్ల మత్తులో మునిగిన హాస్పిటల్ అధికారులు వారికి తొత్తుగా మారారు. చట్టాలు పక్కనపెట్టి, ఏజెన్సీలు ఏది చెప్తే అదే వేదం అన్నా విధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు, లక్ష్మీ కళ్యాణ్ కుమార్ అనే హాస్పిటల్ పారిశుధ్య కార్మికులను హక్కులు అడిగినందున లేని సమస్యలను ఆపాధించి చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వకుండా, క్రమశిక్షణ చర్యలు కాకుండా ఉద్యోగం నుండి తొలగించడం ఏ చట్టంలో ఉందని వారు ప్రశ్నించారు. రెక్కాడితే డొక్కాడని పారిశుధ్య కార్మికులను అకారణంగా డ్యూటీ నుండి తొలగించి వారి కుటుంబాలను ఆకలి దప్పులతో రోడ్డున విసిరి వేశారని బాధ వ్యక్తం చేశారు. తొలగించడమే కాకుండా వారు దళిత సామాజిక వర్గానికి చెందిన వారిని, ఎవరి మద్దతు లేని బలహీనులని వారిపై లేనిపోని నిందలు వేస్తూ వారిని అవమాన పరుస్తున్నారని తెలిపారు. తొలగించిన లక్ష్మిని, కళ్యాణ్ కుమార్‌లను తక్షణమే విధుల్లోనికి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికుల పక్షాన సమ్మెకు కూడా వెళ్లవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాష, బజారి, విశ్వనాథం, మద్దయ్య, అయ్యన్న, బజారి, రాజు , కార్మికులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అబ్దుల్ దేశాయి

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

-9 ఆస్పత్రుల పై ఫిర్యాదులు-ఇలానే వస్తే చర్యలు తప్పవు

-జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు హెచ్చరిక



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఆరోగ్య శ్రీ రోగుల నుండి డబ్బులు వసూలు చేసి వైద్యం చేస్తే అలాంటి ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత ఆస్పత్రుల యాజమాన్యాలను హెచ్చరించారు. తమ దృష్టికి తొమ్మిది ఆస్పత్రిలో పై ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇలానే భవిష్యత్తులో వస్తే సంబంధిత ఆసుపత్రి యాజమాన్యాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం అమలు పై జిల్లా స్థాయి క్రమశిక్షణ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు..అయినప్పటికీ జిల్లాలో ఉన్న తొమ్మిది ప్రైవేట్ ఆస్పత్రులలో 26 మంది ఆరోగ్య శ్రీ రోగుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు రావడం పట్ల ఆస్పత్రి యాజమాన్యాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఫిర్యాదులు రావడం వల్ల అంతిమంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. అదే విధంగా డబ్బు వసూలు చేసిన 9 ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుండి తీసుకున్న మొత్తాన్ని రీఫండ్ చేయడంతో పాటు మూడింతల మొత్తాన్ని అదనంగా చెల్లించేలా చర్యలు తీసు కోవాలన్నారు. ఇక మీదట అయినా ఆస్పత్రి యాజమాన్యాలు మరల ఇటువంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా, ఆరోగ్యశ్రీ రోగులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ రామగిడ్డయ్య ,డిసిహెచ్ఎస్ రాంజీ నాయక్, ఆరోగ్య మిత్ర సూపర్వైజర్స్ ,ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి బొంతమునెప్ప

వినతులను పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-సి బెళగల్ : జనరల్ బాడిలో అధికారులు, నాయకుల దృష్టికి వచ్చిన వినతులను, సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపిపి బొంతల మునెప్ప సమీక్షలో పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, ఖర్చులు వంటి నివేదికలు స్వీకరించి, చేయాల్సిన అభివృద్ధిని గూర్చి మాట్లాడారు. జడ్‌పిటిసి తో పాటు ఆయా అధికారులు డుమ్మా కోట్టారు. బుధవారం జనరల్ బాడికి జడ్‌పిటిసి గిరిజోన్ తో పాటు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గోనెనాయక్, వైద్యులు సునీత, రామచంద్ర, వైద్య సిబ్బంది, ఆర్అండ్‌పి ఎస్ఇ, బిసి హాస్టల్ వార్డెన్, కెజిబివి ఎస్ఒ జ్యోతి, తదితరులు డుమ్మా కొట్టారు.

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

- 17న కలెక్టరేట్ ముందు ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికుల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లు కావస్తున్నప్పటికీ హామీని నెరవేర్చలేదని చెప్పారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా ఫేషియల్ యాప్ ద్వారా అటెండర్స్ నమోదు చేయడం అనేది సమంజసం కాదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 17న కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాకు కార్మికులు హాజరు కావాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు నాగరాజు, ఇస్మాయిల్, సల్మాన్ పాల్గొన్నారు.

'గాలికుంటు' నివారణ టీకాలు వేయించాలి

- వెటర్నరీ డాక్టర్ అశోక్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ డాక్టర్ అశోక్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని బనవాసి గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్యాంపిల్స్ సేకరణ, పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా మార్చి 1 నుంచి 31 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి ఆవు, గేదె, గొర్రె, మేకలకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. గోపాలమిత్ర నల్లన్న, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉంటాం

- ప్రాథమిక వైద్యశాల డాక్టర్ న్యూటన్

ప్రజాశక్తి - హొళగుంద

రోగులకు అందుబాటులో ఉంటానని ప్రాథమిక వైద్యశాల డాక్టర్ న్యూటన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోగులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రాథమిక వైద్యశాలలో ఉన్న సౌకర్యాలన్నీ రోగులకు అందిస్తామని తెలిపారు. అత్యవసరం అనిపిస్తే తప్ప రోగులను రెఫర్ చేసే అవసరం లేదన్నారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోజుకు 5 నుంచి 6 లీటర్ల నీరు తాగాలని, ఎండకు దూరంగా ఉండాలని తెలిపారు. కాచి వడబోసిన నీరు మాత్రమే తాగాలన్నారు. ఉదయం 11 గంటల తర్వాత అత్యవసరం అనిపిస్తే తప్ప బయటకు రావడం మంచిది కాదన్నారు. రైతులు మధ్యాహ్న సమయంలో పనులకు దూరంగా ఉండి చెట్ల కింద సేద తీరాలని సూచించారు. సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేసుకోవాలని తెలిపారు. జాగ్రత్తలు పాటించడం వల్ల వడదెబ్బకు దూరంగా ఉండవచ్చని సూచించారు.

ప్రజా సమస్యలే అజెండా

-శాసనమండలి టిడిపి ఉప నాయకులు బిటి.నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర శాసనమండలిలో ప్రజా సమస్యలను ప్రస్తావించి ప్రజల పక్షాన ఉండి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతిపక్ష పార్టీ పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తానని, పార్టీ నాయకత్వం తనపై పెట్టిన నమ్మకాన్ని పూర్తిస్థాయిలో నెరవేరుస్తానని ఎపి శాసనమండలి టిడిపి ఉప నాయకులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు తెలిపారు. బుధవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు తనను ఎపి శాసన మండలిలో టిడిపి ఉప నాయకునిగా ఎంపిక చేశారని తెలిపారు. అధినేత చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పార్టీ ఫ్లోర్ లీడర్ యనమల రామకృష్ణుడు, సహచర శాసన మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. శాసన మండలిలో టిడిపి తరపున ఉప నాయకునిగా ప్రజల పక్షాన రాష్ట్ర సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు వెళ్తానని తెలిపారు.

పాండవగల్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పాండవగల్లు గ్రామంలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎంపిటిసి కె.లింగన్న బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, టోర్నమెంట్ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు అందించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిని పాండవగల్ గ్రామం 7వ వార్డు సభ్యుడు కృష్ణ, విద్యా కమిటీ మెంబర్ తాయన్న, రెండో బహుమతి ఆదోని ఎక్కి పంప్స్ డీలర్ శ్రీకాంత్ అందిస్తున్నట్లు చెప్పారు. విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ రామాంజనేయులు,

ఆస్పత్రిలో రోగుల అవస్థలు...

- పట్టించుకోని వైద్యులు
- ఒకే మంచంపై ఇద్దరు రోగులకు చికిత్స

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సామాన్యులకు, రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామని పాలకులు చెబుతూనే ఉన్నారు. సామాన్య రోగులు ఆస్పత్రికి వస్తే మాత్రం సేద తీరి చికిత్సలు పొందేందుకు కూడా అనుకూలంగా లేని పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారిందని ఆందోళన చెందుతున్నారు. కనీసం రోగులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, సమస్యలు వినే వారే కరువయ్యారని వాపోతున్నారు.

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగుల పరిస్థితి అధ్వానంగా ఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రయివేట్ ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించుకోలేక సామాన్య రోగులు ప్రభుత్వాస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. అక్కడ మెరుగైన వైద్యం ఏమో కానీ కనీసం సెలైన్ బాటిల్ కూడా స్వేచ్ఛగా ఎక్కించుకోలేని పరిస్థితులు ఉన్నాయని రోగులు వాపోతున్నారు.

ఒపి చీటికి అవస్థలు : ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రోజుకు 300 మంది రోగులు ఒపికి వస్తున్నారు. అందులో ఆయాసం, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు, ఇతర ప్రమాదాలు జరిగిన వారు వస్తూ ఉంటారు. ఒపి కౌంటర్‌లో వివరాలు



ఒకే మంచంపై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్లిప్ చేతికిచ్చేలోపు సమయం పడుతుండడంతో వరుసలో నిలవలేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, పురుషులకు ఒకే కౌంటర్ ఉండడంతో వరుసలో నిల్చలేక సొమ్మసిల్లి పడిన సందర్భాలు ఉన్నాయని రోగులు వాపోతున్నారు. కనీసం మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆస్పత్రి నిర్వాహకులను కోరినా పట్టించుకునే వారే లేరని రోగులు మండిపడుతున్నారు.

పేరుకే 100 పడకలు : ఆదోని ఏరియా ఆస్పత్రి 100 పడకలుగా గుర్తింపు ఉంది. అందుకు తగ్గట్లు సదుపాయాలు, వైద్యులు, నర్సులు, మందులు, ఇతర సిబ్బంది లేరని రోగులు చెబుతున్నారు. అరకొర డాక్టర్లు ఉన్నా కనీసం చేయి ముట్టి చూడని వైనం ఉందంటూ కొందరు రోగులు ఆవేదన చెందుతున్నారు. తాము చెప్పిందే మాత్రమే వింటున్నారని పారా సిటమల్, పెయిన్ కిల్లర్, సెలైన్ బాటిల్స్ మాత్రమే ఇస్తూ, మెరుగైన వైద్యం కనపడని పరిస్థితిని బహిరంగంగానే చెబుతున్నారు. పడకలు చాలక ఒకే మంచంపై ఇద్దరేసి పడుకోవడం వల్ల కనీసం పక్కకు కూడా తిరగలేని దుస్థితి ఉంది. సామాన్యులంటే ఇంత చులకనా అంటూ వైద్యుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు : ప్రభుత్వాస్పత్రుల్లో రోగులు పడుతున్న అవస్థలను కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నా డివిజన్ కేంద్రమైన ఆదోనిలో ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. కొందరు వైద్యులకు ప్రయివేట్ క్లినిక్‌లపై ఉన్న శ్రద్ధ విధినిర్వహణపై చూపడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఆదోనిలో సబ్ కలెక్టర్ అప్పుడప్పుడు ఆస్పత్రిని సందర్శించాలని రోగులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. నెలకోసారి ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సమక్షంలో జరుగుతున్నా సమస్యల ప్రస్తావన ఉండడం లేదు. సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చి పరిష్కార దిశగా చొరవ చూపే అవకాశమున్నా అటువైపు అధికారులు దృష్టి సారించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా పల్లెదొడ్డి బోనాల ఊరేగింపు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని గద్దెరాళ్ల మారమ్మ దేవర ఉత్సవాల్లో భాగంగా బుధవారం పల్లెదొడ్డి బోనాల ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మారెమ్మ దేవాలయంలో దేవత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు, దేవరగట్టు ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ సుజాతమ్మ కుమారుడు కోట్ల రాఘవేంద్రా రెడ్డి మారెమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న పల్లెదొడ్డి మహిళలు

దేవదాయ శాఖ కార్యనిర్వాణాధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు సాగాయి. పల్లెదొడ్డి గ్రామస్తులు డప్పు, వాయిద్యాలతో పొట్టేళ్లను ముందు తీసుకెళ్తూ సుమారు 250 మంది మహిళలు వరుసగా బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 8 మంది ఎస్ఐలు, నలుగురు సిఐలు, 150 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

చిన్న గొడవలను పెద్దగా చేసుకుని నష్టపోవద్దు

- వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాల్లో చిన్న, చిన్న గొడవలు పడి పెద్దగా చేసుకుని పోలీసు స్టేషన్లకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ సూచించారు. బెల్డోనా గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలోని ఇరు వర్గాల కుటుంబాలు అంజనమ్మ, పెద్ద రామాంజనేయులు గొడవ పడ్డారు. బుధవారం గొడవపడిన ఇరు కుటుంబాల సమస్యలను తెలుసుకొని సముదాయించి పరిష్కరించారు. గొడవ పడినప్పుడు తాళిబొట్టు పోగొట్టుకున్న అంజనమ్మ కుటుంబానికి తాళిబొట్టు, రూ.20 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. ఏ కుటుంబంలో అయినా చిన్న సమస్యలు వస్తుంటాయని, వాటిని ఆ కుటుంబ పెద్దలే పెద్ద మనసు చేసుకొని పరిష్కరించాలని కోరారు. పోలీసు స్టేషన్లకు వెళితే నష్టపోవడం తప్ప ఏమీ ఉండదని తెలిపారు. ఆర్‌బికె అడ్వయిజరీ మెంబర్ కమలమ్మ, శ్రీధర్ పాల్గొన్నారు.



గొడవలో నష్టపోయిన అంజనమ్మ కుటుంబానికి తాళిబొట్టు, రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు లాంగ్వేజ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్ష హాజరు కావాల్సి ఉండగా గంటముందే విద్యార్థులు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అరగంట ముందు విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించారు. ఆదోని పట్టణంలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాల ఎ, బి సెంటర్లు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, బాలాజీ జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, సాయి జూనియర్ కళాశాలతో పాటు మరో రెండు కేంద్రాల్లో 3200 మంది విద్యార్థులు పరీక్షకు అయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద తల్లిదండ్రుల సందడి

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కావడంతో కేంద్రాల వద్ద తల్లిదండ్రుల సందడి నెలకొంది. సీటింగ్ బోర్డు మొత్తం పిల్లలు కాకుండా తల్లిదండ్రులే ఆక్రమించి తమ పిల్లలు ఏ రూములో ఎటువైపు కేటాయించారో ప్రకటించడం, ఒఆర్ఎస్, బోర్నవిటా పోసి చివరి కప్పు శక్తి కోసం అందించడం, తల్లులు కొంగు చివరతో, తండ్రులు కర్చీఫ్‌తో మూతి తుడవడం, లోపలికి పోయేటప్పుడు చల్లనీళ్ల బాటిల్ అందించడం, ఎప్పుడెప్పుడు వాటిని తాగాలో చెప్పడంలో బిజీబీజీగా గడిపారు. పాతిక సంవత్సరాల పైబడిన కాలంలోని తమ అనుభవాల ఆధారంగా పరీక్ష రాసే టిప్స్ చెప్పడం, మార్జిన్లు వదలడం, బిట్లు ముందు రాయి, నెంబర్ చెక్ చేసుకోవడం వంటి సలహాలు ఇచ్చారు. పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు పదికి పదిసార్లు చెక్ చేయడం, స్కేలు విరగకుండా జాగ్రత్తలు చెప్పడం, ముందు, వెనుక, పక్కన కూర్చొన్న విద్యార్థుల పట్ల ఎలా మసలుకోవాలో లౌక్యం బోధనలు చేశారు. పరీక్ష రాసే పిల్లలకు దారివ్వకుండా అంతా తల్లిదండ్రులే గుమిగూడి ఆక్రమించిన గేటు వద్దకు చేయి పట్టుకుని పిల్లలను వదిలారు. సెక్యూరిటీ గార్డులు కసురుతుంటే, గేటుదాటి లోపలికి పోతుంటే గేట్ల సందుల్లోంచి, గోడల మీద నుంచి చేతులూపడం, కళ్లల్లో నీళ్ళు పెట్టుకోవడం వంటి దృశ్యాలు కనిపించాయి. కనీస ఆలోచన లేని టీనేజ్ పిల్లలు, హద్దులేని తల్లిదండ్రుల ప్రవర్తన మీద సైకాలజీ చదవడానికి ఇంతకన్నా పెద్ద వేదిక ఎక్కడా దొరకదు. **హొళగుంద :** స్థానిక జూనియర్ కళాశాలలో 220 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజరు కాగా 214 మంది హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ శశి కుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ సంజన తెలిపారు. తెలుగు, హిందీ, కన్నడ పరీక్షలు జరిగాయని, జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. **ఆలూరు :** ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష నిర్వహించారు. ఆలూరు జూనియర్ కళాశాల, మోడల్ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలలో మొత్తం 249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 13 మంది గైర్హాజరయినట్లు పరీక్షల చీఫ్ బడే సాబ్ తెలిపారు. ఎపి మోడల్ స్కూల్‌లో మొత్తం విద్యార్థులు 190 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 9 మంది గైర్హాజరయినట్లు పరీక్షల డిపార్టుమెంటల్ అధికారి తిప్పేస్వామి తెలిపారు.



ఆలూరులో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన రైల్వే కూలీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలో ఇద్దరు పిల్లలతో సహా రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహితను రైల్వే కూలీలు గుర్తించి కాపాడారు. పట్టణంలోని శివశంకర్ నగర్‌కు చెందిన మంజులకు మండలంలోని సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన నిర్వాణ్‌తో వివాహం జరిగింది. వీరికి 3, 5 ఏళ్ల వయస్సున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం ఫ్లైఓవర్ కింది భాగాన రైలు పట్టాలపై ఇద్దరు పిల్లలతో సహా మంజుల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే మట్టి పనులు చేస్తున్న రైల్వే కూలీలు గుర్తించి మహిళ, పిల్లలను కాపాడారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. రెండో పట్టణ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారించారు. తన భర్త ఇతర మహిళతో సఖ్యతగా ఉండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించినట్లు మంజుల వాపోయారు. పోలీసులు కౌన్సెలింగ్ నిమిత్తం ఆమెను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

పాము కాటుతో వలస కూలీ మృతి

ప్రజాశక్తి - కౌతాళం

పాముకాటుకు గురై వలస కూలీ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని పోతుల దొడ్డి గ్రామానికి చెందిన డి.రామయ్య (42) గుంటూరు జిల్లా బండారు పల్లె గ్రామంలో పొలంలో పని చేస్తున్న సమయంలో పాముకాటుకు గురైనట్లు భార్య రామలింగమ్మ తెలిపారు. వలస కూలీ మృతి చెందిన విషయం గ్రామస్తులకు తెలియడంలో శోకసంద్రంలో మునిగారు.

16 నుంచి 20 వరకు శనగ కొనుగోలు నిలిపివేత

- కెడిసిఎంఎస్ గోదాం ఇన్‌ఛార్జీ ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పప్పు శనగ కొనుగోలును ఈనెల 16 నుంచి 20 వరకు నిలిపివేస్తున్నట్లు కెడిసిఎంఎస్ గోదాం ఇన్‌ఛార్జీ ప్రకాష్ రెడ్డి బుధవారం తెలిపారు. వర్షాలు కురుస్తున్నాయనే సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పప్పు శనగను గోదాముకు తరలిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

చిప్పగిరిలో బస్సు షెల్టర్ కరువు...

- నిలబడడానికి కూడా నీడలేని దుస్థితి
- నీడ కోసం షాపుల దగ్గరకు వెళితే వ్యాపారం చేయాల్సిందే
- మధ్యాహ్నం ఎండతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- చలివేంద్రం ఏర్పాటుకు ముందుకు రాని అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బస్సు కోసం వేచి ఉండే సమయంలో నిలబడడానికి కూడా నీడ లేదు. హోటళ్లు, షాపుల వద్ద నిలబడదామనుకుంటే అక్కడ వ్యాపారం చేయాల్సిందే...

ప్రభుత్వాలు ప్రజల సౌకర్యాల కోసం ఎన్ని రూ.కోట్లు ఖర్చు పెడుతున్నప్పటికీ ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. చిప్పగిరి బస్టాండ్‌లో నిలబడడానికి కూడా నీడ కరువైందని ప్రయాణికులు వాపోతున్నారు. పనుల నిమిత్తం పలు గ్రామాల నుంచి ప్రజలు వారు చిప్పగిరికి వచ్చి వెళ్తుంటారు. స్థానిక బస్టాండ్ దగ్గరకు వస్తే కూర్చోవడానికి కూడా నీడ లేక ఏ హోటళ్ళు, కూల్ డ్రింక్ షాపుల దగ్గరకు వెళితే అక్కడ కూర్చోనివ్వడం లేదు. తాగునీరు అడిగినా వ్యాపారం



నీడ కోసం హోటళ్లు, షాపుల దగ్గరకు వెళ్లి కూర్చుంటున్న ప్రయాణికులు

చేస్తే తప్ప ఇవ్వని దుస్థితి. మండలం నుంచి ఏరూరు, డేగలహాల్ గ్రామాలకు ఒక రోజులో రెండు సార్లు బస్సు వెళ్తుంది. ఆ సమయాలకు ఆ గ్రామాల వారు పనులు ముగించుకొని బస్టాండ్‌కు వస్తే నీడ కోసం రూ.వంద ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. కళాశాల, హై స్కూల్‌కు వచ్చే విద్యార్థులకు నిత్యం ఈ ఇబ్బందులు తప్పడం లేదు. అనారోగ్యంతో ఉన్న వారు, వృద్ధులు బస్సు కోసం నిలబడి ఉండలేక నానా తంటాలు పడుతున్నారు. కనీసం ప్రయాణికులకు నీటి వసతి కూడా కల్పించలేని దుస్థితిలో నాయకులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి అంబేద్కర్ సర్కిల్ దగ్గర బస్సు షెల్టర్‌ను నిర్మించి ఒక చలివేంద్రం ఏర్పాటు చేయాలని మండలంలోని అనేక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు

- రాఘవేంద్ర రెడ్డి, నేమకల్లు



పనుల నిమిత్తం చిప్పగిరికి వచ్చే ప్రజలకు, ప్రయాణికులకు బస్సు షెల్టర్ లేకపోవడం ఇబ్బందే. వేసవి అయినా, వర్షాకాలమైన తలదాచుకోవడానికి బస్సు షెల్టర్ తప్పనిసరిగా నిర్మించాలి. దాతలు ముందుకొచ్చి నిర్మిస్తే పదిమంది తలుచుకుంటారు.

చర్చి నిర్మాణంపై హైకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ

- తహశీల్దార్ కార్యాలయంలో పిటిషనర్‌పై దుర్భాష
- పోలీసు భద్రత మధ్య పిటిషనర్ తరలింపు
- దుర్భాషలాడిన వ్యక్తిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని రామచంద్ర నగర్ కాలనీలో చర్చి నిర్మాణంపై హైకోర్టులో ప్రయివేట్ వ్యక్తి వేసిన పిటిషన్‌పై తహశీల్దార్ చంద్రశేఖర్ విచారణ చేపట్టారు. బుధవారం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పిటిషనర్ కర్ణ, ఆయన మిత్రుడు నరసింహ, గ్రామ కార్యదర్శి నాగరాజు, విఆర్‌ఒలు భీమనగౌడు, పవన్ కుమార్ వర్మ చర్చి నిర్మాణపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చర్చి నిర్మాణం ఆపాలని హైకోర్టు ఆదేశాలను తెలియజేసే బహిరంగ ప్రకటనను ఫ్లెక్సీ ద్వారా కాకుండా బోర్డును ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. వెంటనే అమలు చేయాలని తహశీల్దార్ చంద్రశేఖర్ కార్యదర్శి నాగరాజును ఆదేశించారు. విషయం తెలుసుకున్న చర్చి సంఘం పెద్దలు మద్దతు దారులతో చేరుకోగా పోలీసులకు సమాచారం అందించారు. సంఘ పెద్దల్లో ఒకరు తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న పిటిషనర్ కర్ణను దుర్భాషలాడుతూ



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సంఘం సభ్యులు

దూషించడంతో పిటిషనర్ మళ్లీ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ సమాచారంతో సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు సిబ్బందితో వచ్చి అందరినీ అక్కడ నుంచి పంపించి వేశారు. పిటిషనర్ కర్ణ మాట్లాడుతూ... ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం పరిసర ప్రాంతాల్లో ఇతర మతానికి చెందిన చర్చి నిర్మించరాదని మే 5, 2022న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. తహశీల్దార్ చంద్రశేఖర్ సమాచారం మేరకు మంత్రాలయం వచ్చామని తెలిపారు. దుర్భాషలాడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం పోలీసు భద్రత మధ్య వారిని పంపించారు.

ఆధునీకరణను అడ్డుకొని కించపరిచారు : చర్చి సంఘం పెద్దలు

చర్చి ఆధునీకరణను అడ్డుకొని క్రిష్టియన్ మతాన్ని కించపరిచారని చర్చి సంఘం పెద్దలు సాల్మన్, ఈరన్న, అబ్రహాం, శాంతిరాజు, భాస్కర్, కుల పెద్దలు కయ్యన్న, ఏబు, ప్రభుదాసు, ఏబు, రాజు పేతూరు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు తహశీల్దార్ చంద్రశేఖర్‌ను కలుసుకుని పిటిషన్ దారుని చర్చి దగ్గరకు తీసుకుని రావడం ఏమిటని, ఏదైనా సంఘటన జరిగి ఉంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. చర్చి నిర్మాణం అక్టోబర్ 17, 1982న జరిగిందని తెలిపారు. ఆధునీకరణ కోసం పనులు చేపట్టగా ఆదోనికి చెందిన కర్ణ అనే వ్యక్తి చర్చి నిర్మాణంపై హైకోర్టుకు వెళ్లడం బాధాకరమన్నారు. సమాజంలో ప్రతి పౌరునికీ స్వేచ్ఛ ఉందని, ఏ మతాన్ని అయినా ఆరాధించవచ్చని చెప్పారు. హక్కులను కాలరాయడానికి ప్రయత్నాలు జరిగితే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

5న ర్యాలీని జయప్రదం చేయండి : రైతు సంఘం

ప్రజాశక్తి - కౌతాళం

బిజెపి విధానాలను వ్యతిరేకంగా జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో వెంకటేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 5న కార్మిక, కర్షకుల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. బిజెపి అధికారంలో వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి పేదలపై భారం మోపిందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు విలవిల్లాడుతుంటే, వారిని అణగతొక్కడానికి ప్రత్యేకమైన చట్టాలు తీసుకొచ్చిందని విమర్శించారు. పెంచిన ధరలను తగ్గించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఉల్లిగయ్య, శంకరయ్య, హనుమంతు, ఈరన్న పాల్గొన్నారు.

IN THE COURT OF THE IIND ADDL DISTRICT JUDGE KURNOOL AT ADONI.
I.A. NO.24/2022 IN O.S. NO.14/2008.

Between:
Abdul Qalyoom. ...PETITIONER.
VS
Shamshunnisa Khatoon (died) by LRS and others. ...RESPONDENTS.

To: R-12,R-15 and R-16

12. M. Shaheda Khatoon D/o: M. Habeebur Rahman, Muslim, aged about 56 years, merchant, resident of 1-150, Poola Bazar main road, Kurnool-518001.
15. M.Haseena Khatoon D/o: M. Habeebur Rahman, Muslim, aged about 43 years, merchant, resident of H.No.10/376, Near Fateh Darwaza Mosque, Buddekal Street, Adoni -518301, Kurnool District.
16. M. Hoorunnisa Khatoon D/o: M. Habeebur Rahman, Muslim, aged about 41 years, resident of H.No.10/376, Near Fateh Darwaza Mosque, Buddekal Street, Adoni -518301, Kurnool District.

Whereas the above named the petitioner filed an application Under Order 26 Rule 13 and section 151 C.P.C to appoint an Advocate/Commissioner to divide the petition schedule properties as per preliminary Decree. You are hereby requested to appear before this Honorable court on 23-03-2023 at 10-30 AM either in person or your Advocate and file your counter if any, failing which the matter will be decided in your absence and you will be set ex-party.

SHRI. Y.R.MALLIKARJUNA
ADVOCATE FOR PETITIONERS
ADONI-518301, Kurnool District.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A No. 220/2022 in O.S . NO. 420/ 2022

S.అఫ్రోజ్. ...వాది/అర్జీదారు
-Vs-
సోమ మేఘనాథ్ గౌడ్ వగైరా. ...ప్రతివాదులు/రెస్పాండెంట్లు

2వ రెస్పాండెంటుకు ఆర్డర్ 39 రూలు 1&2 C.P.C ప్రకారం నోటీసులు

2.B. శ్రీనివాస రెడ్డి తండ్రి భూమ శేషి రెడ్డి, ఇంటి నెం.1-34-10-2, రాజా వీధి, ఆత్మకూరు గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.

పై నంబరు దావా లో వాది ప్రతివాదులు దావా షెడ్యూలు ఆస్తిలో ప్రవేశించకుండా పర్మినెంట్ ఇంజన్‌క్షన్ ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేస్తు, ప్రతివాదులు గాని వారి తరపున మనుషులు గాని షెడ్యూలు దాఖలా ఆస్తిలో ప్రవేశించకుండా యాడ్ ఇంటీరిమ్ ఇంజన్‌క్షన్ ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో 2వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 29-3-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూల ముగా తెలియజేడమైనది.

SCHEDULE : The land in Joharapuram village under Kurnool Sub-Division, Kurnool Municipal Corporation limts under 69 ward area in S.R.O, Kurnool and which got right from registered G.P.A Deed Doc.no.69/1194 in 4th book, 74th Volume under page no.83 and 84 with following details. Joharapuram (v), sy.no.107, Total Extent:Ac.0.60 Cents, Schedule Extent : Ac.0.05 cents.
Boundaries : East : land sold to Shaik Rabbani, West : Remaining land under same sy.no, North: Kurnool Atmakur Road, South : Kurnool Pasupala (V)Road.
Total Extent : Ac.0.05 cents.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 29-3-2023

D. భాస్కర్ రెడ్డి,
D.సత్యనారాయణ రెడ్డి,
G. నరేష్ గౌడ్,
వాది/ అర్జీదారు పరం న్యాయవాదులు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S . NO. 420/ 2022

S.అఫ్రోజ్. ...వాది
-Vs-
సోమ మేఘనాథ్ గౌడ్ వగైరా. ...ప్రతివాదులు

2వ ప్రతివాదికి దావా సమన్సు

2.B.శ్రీనివాస రెడ్డి తండ్రి భూమ శేషి రెడ్డి, ఇంటి నెం.1-34-10-2, రాజా వీధి, ఆత్మకూరు గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.

పై నంబరు దావా లో వాది దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో ప్రతివాదులు గాని వారి తరపున మనుషులు గాని ప్రవేశించకుండా ప్రతివాదుల షెడ్యూలు దాఖలా ఆస్తిలో చట్టవ్యతిరేకసనులు చేయకుండా వాది హక్కును భంగపరచకుండా పర్మినెంట్ ఇంజన్‌క్షన్ ఇప్పించమని కోరుతూ మరియు దావా ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో 2వ పతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 29-3-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

SCHEDULE : The land in Joharapuram village under Kurnool Sub-Division, Kurnool Municipal Corporation limts under 69 ward area in S.R.O, Kurnool and which got right from registered G.P.A Deed Doc.no.69/1194 in 4th book, 74th Volume under page no.83 and 84 with following details. Joharapuram (v), sy.no.107, Total Extent:Ac.0.60 Cents, Schedule Extent : Ac.0.05 cents.
Boundaries : East : land sold to Shaik Rabbani, West : Remaining land under same sy.no, North: Kurnool Atmakur Road, South : Kurnool Pasupala (V)Road.
Total Extent : Ac.0.05 cents.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 29-3-2023

D.భాస్కర్ రెడ్డి,
D.సత్యనారాయణ రెడ్డి,
G. నరేష్ గౌడ్,
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు మొదటి అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
I.A No. 161/2022 in A.S . NO. 76/ 2018

మహబూబ్ బీ (died by LR'S). ...అర్జీదారు
-Vs-
ఖాజా హుసెన్ మరియు వగైరాలు. ...రెస్పాండెంట్లు

7th Proposed Respondent Notice

షహనాజ్ W/o ముస్తఫా ఇంటి నెం.15-707, నందికొట్కూరు గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.

పై నంబరు అప్పీలునందు రెండవ రెస్పాండెంటు చనిపోయినందున అతని వారసులుగా చేర్చమని పై అర్జీని దాఖలు చేసుయున్నారు. ఇందులో ప్రపోస్ రెస్పాండెంటు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 31-3-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 31-3-2023

Sri A.జగదీష్ కుమార్,
Smt R. సుదేశ్ణ రెడ్డి,
అర్జీదారు పరం న్యాయవాదులు, కర్నూలు.

IN THE COURT OF THE IIND ADDL DISTRICT JUDGE KURNOOL AT ADONI.
I.A. NO.22/2022 IN O.S. NO.14/2008.

Between:
Abdul Qaiyoom. ...PETITIONER.
Vs.
Shamshunnisa Khatoon (died) by LRS and others. ...RESPONDENTS.

To: R-12,R-15 and R-16

12. M. Shaheda Khatoon D/o: M. Habeebur Rahman, Muslim, aged about 56 years, merchant, resident of 1-150, Poola Bazar main road, Kurnool-518001.
15. M.Haseena Khatoon D/o: M. Habeebur Rahman, Muslim, aged about 43 years, merchant, resident of H.No.10/376, Near Fateh Darwaza Mosque, Buddekal Street, Adoni -518301, Kurnool District.
16. M. Hoorunnisa Khatoon D/o: M. Habeebur Rahman, Muslim, aged about 41 years, resident of H.No. 10/376, Near Fateh Darwaza Mosque, Buddekal Street, Adoni -518301, Kurnool District.

Whereas the above named the petitioner filed an application Under Order 20 Rule 18 and section 151 C.P.C for pass of Final Decree in term of Preliminary Decree. You are hereby requested to appear before this Honorable court on 23-03-2023 at 10-30 AM either in person or your Advocate and file your counter if any, failing which the matter will be decided in your absence and you will be set ex-party.

SHRI. Y.R.MALLIKARJUNA
ADVOCATE FOR PETITIONERS
ADONI-518301, Kurnool District.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KURNOOL
I.P No : 8 /2022

BETWEEN:
Vijaya Battu Vijayalakshmi,
W/o.Kappa Krishnama Raju,
D/o.Vijaya Battu Venkataramana Raju,
Hindu, aged about 36 years,
R/o.Jaswanth Nilayam, 1st floor,
Venkataramana colony main road,
Near Andhrabank,
Kurnool-518006 ....Petitioner
AND
G.Gowri and others. ...Respondents
To,
1.Polisetti Krishnamurthy,
S/o.P.Viswanadam,
Hindu aged about 53 years,
R/o.Sri Venkateswara Kirana and Bakery,
3 rd Line opposite, Venkata Ramana Colony,
Kurnool, **(R4)**
2.P.Padmavathi,
W/o.P.Chandra,
Hindu aged 39,
R/o.H.no : 8/182A1,
Kallur estate, Kurnool, **(R7)**
3. K.Girija Kumari,
W/o.M.Sekhar babu,
Hindu aged 44 years,
R/o.D.no : 2-212,
Vinayaka temple 1st lane, Nandikotukur road,
Nandyal check post, Kurnool, **(R8)**
4. P.Nuthan kumar,
S/o.(Late) Samba siva rao,
Hindu aged 37 years,
R/o.D.no : 2-5-26,
Near bustand, Kurnool, **(R12)**
5. G.Srikanth,
S/o.G.Prasad,
Hindu aged 46 years,
R/o.D.no : 6-15, 2nd lane Ayyappa Colony,
Kurnool. **(R13).** ...Respondents

పై నెంబరు IP లో పిటిషనర్ మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపినను మీరు నోటీసులు తీసుకోనందున ఈ పేపరు నోటిసు ద్వారా పై కోర్టు వారి ఎదుట ది: 11-04-2023 తేదిన ఉదయం 10:30 గంటలకు హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను, లేనియెడల పరోక్షమందు తీర్మానించబడును.

వాయిద తేదీ : 11-04-2023

ఇట్లు
కె.శ్రీరామ్,
పిటీషనర్ తరుపు న్యాయవాది,
కర్నూలు.

ఇంటర్ పరీక్షా కేంద్రంలో పురిటినొప్పులు

- 108 వాహనంలో ఆస్పత్రికి తరలింపు



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పాలవలస దేవి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఇంటర్ పరీక్ష రాస్తుండగానే మహిళకు పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి తరలించిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం చోటుచేసుకుంది. పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన వివాహిత మహిళ పాలవలస దేవి (22) ఒక ప్రయివేటు కళాశాలలో వెటర్నరీ ఒకేషనల్ కోర్సు చదువుతున్నారు. తొమ్మిది నెలల గర్భిణీ అయిన ఆమె తొలి రోజు జనరల్ ఫౌండేషన్ పేపర్ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి హాజరయ్యారు. పరీక్ష ప్రారంభమైన కొద్ది సమయానికే ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ ఆకులరాజు వెంటనే సంబంధిత ఇంటర్ పరీక్ష నిర్వాహణ అధికారులకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. తరువాత ఆమెను 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. ఎక్కువ సేపు కూర్చోవడంతో స్వల్పంగా నొప్పులు వచ్చాయని, ఇంకా డెలివరీకి రెండు రోజులు సమయం పడుతుందని వైద్యులు తెలిపారు.

సామూహిక గృహ ప్రవేశాలపై మళ్లీ సందిగ్ధమే!

- రాష్ట్ర వ్యాప్తంగా ఉగాదికి ఐదు లక్షల ఇళ్లు లక్ష్యం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో వాయిదా?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం మరోసారి వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ కార్యక్రమం ఒకసారి వాయిదా పడింది. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్ష్యల గృహాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించుకుంది. గతేడాది డిసెంబర్ 21న వీటిలో సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని తొలుత అనుకుంది. అప్పటికి లక్ష్యంలో 39.32 శాతం ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో, గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. ఉగాది నాటికైనా ఇవి పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించింది. ఈ నెల 22న ఉగాది నేపథ్యంలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ మరుసటి రోజు ఎమ్మెల్యే కోటాలో ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 25వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. దీంతో, అప్పటివరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. ఈ నేపథ్యంలో గృహ ప్రవేశాల కార్యక్రమం వాయిదా పడొచ్చన్న చర్చ సాగుతోంది. మరోవైపు ఈ కార్యక్రమంపై ఎక్కడా ఎటువంటి కదలికా కనిపించడం లేదు. లక్ష్యాల పూర్తి, కార్యక్రమం రూపకల్పనపై ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఎటువంటి ఆదేశాలూ రాలేదు. మరో వారం రోజులే మిగిలి ఉండడం, సామూహిక ప్రవేశాలపై అధికార యంత్రాంగాన్ని సంసిద్ధత చేసే పని ఇప్పటివరకు జరగకపోవడంతో మళ్లీ వాయిదా పడినట్లుగా అంతా భావిస్తున్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా ప్రభుత్వం 16,60,171 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో ఐదు లక్షల ఇళ్లను



నౌపడలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

2022 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుంది. గత డిసెంబర్ 15 నాటికి 1,96,595 ఇళ్లు (39.32 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. లక్ష్యం సగం కూడా పూర్తి కాకపోవడంతో గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఉగాది నాటికైనా పూర్తి స్థాయిలో గృహాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మంగళవారం నాటికి 3,07,214 (లక్ష్యంలో 62 శాతం) ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వీటిలో ఇంకా సగం ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం, తాగునీటి సౌకర్యం పెండింగ్‌లో ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 33,241 మందితో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 22,032 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిలో సుమారు 11 వేల ఇళ్లకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం, సుమారు పది వేల ఇళ్లకు మాత్రమే తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఐదు జిల్లాల్లో 50 శాతంలోపే ఇళ్లు పూర్తి

రాష్ట్రంలో పది జిల్లాల్లో 50 శాతంలోపే ఇళ్లు పూర్తయ్యాయి. వాటిలో అనంతపురం, పల్నాడు, వైఎస్ఆర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,814 ఇళ్లకుగానూ రెండు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏ మాత్రమూ సరిపోకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రాలేదు. జిల్లా సమీక్షా సమావేశాల్లో మంత్రులు సైతం ఇంటి నిర్మాణ ఖర్చును పెంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. నివాస యోగ్యంలేని చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడం వంటి కారణాలతో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. ఇళ్లు నిర్మించకపోతే పట్టాలు వెనక్కి తీసుకుంటామని అధికారులు, గ్రామ/వార్డు వలంటీర్లు ఒత్తిడి చేయడంతో అయిష్టంగా కొందరు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకోవడం కూడా గృహ నిర్మాణాలు నత్తకడనక సాగడానికి కారణం ఉంది.

ఎసిబి వలలో సీనియర్ అసిస్టెంట్

రూ.3 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ ఎసిబి అధికారులకు చిక్కారు. బుధవారం కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి డిఎస్‌పి శివ నారాయణస్వామి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆయన కథనం మేరకు.. కర్నూలు నగరంలోని సాయిబాబా సంజీవయ్య నగర్ కు చెందిన పి మన్సూర్‌తనం ఏర్పాటు చేయనున్న మున్న ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఫర్మ రిజిస్ట్రేషన్ కోసం జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.మహబూబ్ బాషాను కలిశారు. ఈ మేరకు రూ. 3000 చెల్లించాలని సదరు అధికారి మన్సూర్‌ను కోరారు. అందుకు అంగీకరించని మన్సూరు ఎసిబి 114400 టోల్ ఫ్రీ నెంబర్లు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎసిబి అధికారులు బుధవారం మధ్యాహ్నం సుమారు 12 గంటలకు బాధితుని వద్ద నుంచి సీనియర్ అసిస్టెంట్ మన్సూరు రూ. 3000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిందితున్ని ఎసిబి కోర్టుకు హాజరు పరుస్తున్నామని చెప్పారు.



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-తుగ్గలి

పత్తికొండ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసులు తుగ్గలి పోలీస్ స్టేషన్ ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ పోలీస్ సబ్ డివిజన్‌లో అన్ని గ్రామాలు ప్రస్తుతానికి ప్రశాంతంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ గ్రామాలలో ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగించేందుకు ప్రయత్నం చేసినా ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తికొండ పోలీస్ సబ్ డివిజన్ లోని గ్రామాలకు కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉన్నందున, కర్ణాటక రాష్ట్రం నుండి ఏమైనా చట్టానికి విరుద్ధంగా అక్రమంగా మన ప్రాంతానికి తరలించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పేకాట, మట్కా, బెల్ట్ షాపులు తదితర వాటి నిర్వహణపై పోలీసులు ప్రత్యేక నిఘా వేసి ఉంచినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి పెండేకల్ రైల్వే జంక్షన్ లో గుర్తుతెలియని వ్యక్తి హత్యపై విచారణ వేగవంతం చేస్తామన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి ఎఎస్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 126 విద్యార్థులు పరీక్షలు రాయాల్సిందిగా 13 మంది పరీక్షకు హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాలను పత్తికొండ డిఎస్‌పి, తుగ్గలి ఎస్ఐ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలుపరిచారు.

సినిమాలు, రాజకీయాలు వేర్వేరు

- నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ
- విజయ చాముండేశ్వరి, విశ్వనాథరెడ్డికి ఎన్‌టిఆర్ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి, తెనాలిరూరల్ (గుంటూరు జిల్లా)

సినిమాలను రాజకీయాలను వేరువేరుగా చూడాలని నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో బుధవారం సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ అధ్యక్షత వహించిన ఎన్‌టిఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో, బుర్రా సాయి మాధవ్ నేతృత్వంలో ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్‌లో ఏడాదిపాటు ఎన్‌టిఆర్ సినిమాలను ఉచితంగా ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉత్సవ కమిటీ రోజుకొక కళాకారులను సన్మానిస్తూ ప్రతినెలా సినీ ప్రముఖులకు ఎన్‌టిఆర్ పురస్కారాలను అందజేస్తోంది. ఈ నేపథ్యంలో సినీ నటి సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, నిర్మాత డి నాగిరెడ్డి తనయుడు విశ్వనాథరెడ్డిలకు ఈ పురస్కారాన్ని బాలకృష్ణ అందజేశారు. అనంతరం ఎన్‌టిఆర్ నటించిన పాతాళ భైరవి చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మహానటుడు ఎన్‌టిఆర్ పేరుమీద కళామతల్లి ముద్దుబిడ్డలను సినీరంగ




విజయ చాముండేశ్వరిని సత్కరిస్తున్న బాలకష్ణ ఆలపాటి తదితరులు

ప్రముఖులను సత్కరించుకోవడం మంచి సంప్రదాయం అన్నారు. సావిత్రి, ఎస్‌వి రంగారావు, రేలంగి, అంజి లాంటి ఎందరో ప్రముఖులను పాతళభైరవి చిత్రం పరిచయం చేసిందని గుర్తుచేశారు. అటువంటి చిత్రాన్ని నిర్మించిన నాగిరెడ్డి కుమారుడు, మహానటి సావిత్రి కుమార్తెను సన్మానించుకోవడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. విజయ చాముండేశ్వరి మాట్లాడుతూ తెనాలితో సంబంధం ఈనాటిది కాదని తెలిపారు. 2017లో తెనాలి ఒక కార్యక్రమానికి వచ్చానని గుర్తుచేశారు. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ లాంటి మహాపురుషుని సినిమాలకు నిర్మాతగా నాన్న, తాను పనిచేశామని తెలిపారు. బాలయ్య చేతులమీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

'ప్రజా స్పందన' సిఎస్.రావు మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



సిఎస్.రావు (ఫైల్ ఫొటో)

విశాఖ నగరానికి చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి సిఎస్.రావు (93) బుధవారం కన్నుమూశారు. ఆరేళ్లగా నరాల బలహీనత వ్యాధితో బాధపడుతున్న ఆయన స్థానిక ద్వారకానగర్ ఐదో లైన్‌లోని తన తన నివాసంలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పూర్తి పేరు చాగంటి సుందరరావు. సిఎస్.రావుగానే నగర ప్రజలకు సుపరిచితులు. ప్రజా స్పందన పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణపై ఆయన తీవ్ర పోరాటం సాగించారు. విశాఖపట్నం కేంద్ర కారాగారాన్ని అడవివరం ప్రాంతానికి తరలించిన సమయంలో పాత జైలు ప్రాంతంలో అతిపెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం కోసం గత ప్రభుత్వాలు ప్రయత్నించాయి. ఆ స్థలంలో ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను తొలగించడాన్ని తప్పుబడుతూ సిఎస్.రావు న్యాయ పోరాటం చేశారు. ఆ ఉద్యమానికి కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చింది. దీంతో ప్రభుత్వం అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని విరమించుకొని పార్కును నిర్మించింది. వైఎస్ఆర్ సెంట్రల్ పార్కుగా ఇది నేడు పేరొందింది. సిఎస్.రావు మృతి వార్త తెలిసిన వెంటనే నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.బాలమోహనదాస్ తదితరులు తరలివచ్చి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

జీవో నెంబర్ 21 రద్దు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆటో కార్మికులకు శాపంగా మారిన ఈ చలానాలు రద్దు చేయాలని జీవో నెంబర్ 21రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. యూనియన్ నగర కార్యదర్శి ఆర్.కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎస్ .మునేప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు వలన ఆటో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రీన్ టాక్స్, ఈ చలానా పేరుతో ఆటో కార్మికులకు పోలీసుల వల్ల నెలలో రెండు మూడుసార్లు ఫైన్లు వేయడం వలన ఆటో కార్మికులకు ఆదాయం అంత ఫైన్లుకే కట్టడానికి సరిపోతుందన్నారు. అందుకే పెంచిన ఈ చలానాలు రద్దు చేసి పోలీసులు వేధింపులను ఆపాలని వారు డిమాండ్ చేశారు.

నాడు-నేడు రెండో విడత నిధులు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని 618 పాఠశాలలకు , 21 జూనియర్ కళాశాలలకు రూ.18 .86 కోట్లు నిధులు విడుదల అయ్యాయని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె. వేణుగోపాల్ వెల్లడించారు.. అందులో జూనియర్ కాలేజీలకు రూ.2 కోట్ల 24 లక్షలు , పాఠశాలలకు రూ.16 కోట్ల 62 లక్షల నిధులు విడుదల అయ్యాయన్నారు. ఈ నిధులను పాఠశాల పేరెంట్స్ కమిటీకి విడుదల చేశామన్నారు. మిగిలిన పాఠశాలలకు కూడా త్వరలోనే నిధులు విడుదల అవుతాయన్నారు. ఈ నిధులను వినియోగించుకొని పాఠశాలల్లోని నాడు-నేడు పనులను నాణ్యతగా, వేగవంతముగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు.

సిఎస్ఇ వెబ్‌సైట్ లో రిజిస్టర్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ప్రైవేట్ ,అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు తమ వివరాలను మార్చి 16 లోపు సిఎస్ఇ వెబ్సైట్‌లో రిజిస్టర్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పాఠశాలల యాజమాన్యాలను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులతో విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత నిర్బంధ విద్య అమలుకు సంబంధించి పాఠశాలల రిజిస్ట్రేషన్ పై కలెక్టర్ సమావేశం అయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం -2009 సెక్షన్ 12(1)(C) ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ మేరకు 2023- 24 విద్యా సంవత్సరంలో 1 వ తరగతి అడ్మిషన్ కొరకు సీట్లు కేటాయించాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రైవేట్ ,అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు తమ వివరాలను మార్చి 16 లోపు వెబ్సైట్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 545 ప్రైవేటు పాఠశాలలు ఉండగా అందులో 113 మాత్రమే నమోదు అయ్యాయని మిగిలిన పాఠశాలలను కూడా గురువారం సాయంత్రంలోగా ప్రైవేటు పాఠశాలల వివరాలను వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత అయ్యేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిఇఒ రంగారెడ్డి, ఎడి శామ్యూల్ పాల్, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

కన్నడ భక్తుల సేవలో తరించిన ఆంధ్రులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్



ప్రతి సంవత్సరం ఉగాది పండగకు శ్రీశైలం మల్లికార్జునుని సన్నిధికి చేరేందుకు కన్నడ భక్తులు కాలినడకన వెళుతుంటారు. రాత్రనగా పగలనగా నడక దారిన వెళ్లే శివుని భక్తుల సేవలో ఆంధ్రులు అడగడున అన్నదానం, మజ్జిగ, చల్లని నీళ్లు అందిస్తూ తరిస్తున్నారు. బుధవారం కర్నూలు నగరంలోని విద్యుత్ భవన్ వద్ద తండ్రి చల్ల శ్రీరాములు జ్ఞాపకార్థం దేవి శ్రీనివాసులు, రామచంద్రమ్మ, మురళిలు 270 లీటర్ల పాలతో తయారు చేసిన మజ్జిగను దారి వెంట పోయే పాదచారులకు మజ్జిగను అందించి తరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగఓట్లు డబ్బు ప్రవాహం

టి డి పి పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి సూటి ప్రశ్న

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వైసిపికి 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపిలతో ప్రజాభలం ఉందనీ విర్రవీగే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగఓట్లను, డబ్బును, అధికార దుర్వినియోగాన్ని ఎందుకు ప్రోత్సాహించారనీ కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూటిగా ప్రశ్నించారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమిశెట్టి మాట్లాడుతూ పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు మీ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికలకు ముందు ప్రచారం చేసిన ఎన్నికల కమిషన్ అధికారులు ఎన్నికల రోజు అన్ని నియోజకవర్గాలలో చోటుచేసుకున్న దొంగ ఓట్ల విషయమై ఎందుకు స్పందించడం లేదని ఎందుకు అరికట్టలేదని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు వచ్చిన ఎంతో మందిని వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు, ఎన్నికల అధికారులు వారి విద్యార్హతలను గురించి ప్రశ్నిస్తే వారిలో చాలా మంది 5 నుండి 10 వ తరగతి మాత్రమే చదువుకున్నామని చెప్పారన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాలో ఎలా దొంగఓట్లను ప్రోత్సాహించారో మీడియాలో చూశామని, ఇప్పటికే



మాట్లాడుతున్న టి డి పి పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు

రాష్ట్రంలో ప్రజాదరణ కోల్పోయిన జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేతకాక చేతులెత్తేశారని, రాష్ట్రంలో 2024లో ఖచ్చితంగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని, అప్పుడు మంత్రి రామచంద్రారెడ్డి ఎక్కడుంటాడో తెలియదన్నారు. దొంగ ఓట్ల ద్వారా దొడ్డిదారిన అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె నాగేంద్రకుమార్, బిసి సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు పాల్గొన్నారు.

ప్లీహం అతిగా పెరిగి బాలిక ఎదుగుదల ఆగిన వైనం

-పలు సమస్యలకు ఒకే శస్త్రచికిత్సతో పరిష్కారం
-కర్నూలు కిమ్స్ వైద్యులు డాక్టర్ జానకిరామ్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ :



ఎదుగుదల సరిగా లేకపోవడాన్ని చాలామంది తల్లిదండ్రులు సరిగా పట్టించుకోరు. పిల్లలు సరిగా తినట్లేదని వదిలేస్తారు. కానీ, అది పెద్ద ఆరోగ్య సమస్య అయ్యేందుకు అవకాశం ఉంటుందన్న విషయం వాళ్లకు తెలియదు. కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం పోలకల్లు గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక విషయంలో సరిగ్గా ఇలాగే జరిగింది. తోటి పిల్లల కంటే బాగా పొట్టిగా, సన్నగా ఉండే ఆ పాపను మొదట్లో తల్లిదండ్రులు అంతగా పట్టించుకోలేదు. తర్వాత ఉన్నట్టుండి రక్తపు వాంతులు కావడంతో ఆందోళనకు గురై కర్నూలు కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ బాలికకు ఉన్న అరుదైన సమస్యను గుర్తించి, దానికి చికిత్స చేసిన కర్నూలు కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, అడ్వాన్స్‌డ్ లాప్రోస్కొపీ, బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ సూరా జానకిరామ్.. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మానవ శరీరంలో మూలుగ రక్తకణాలను సృష్టిస్తుంది. కావల్సిన వాటి కంటే అధికంగా ఉండే రక్తకణాలను ప్లీహం చంపేస్తుంటుంది. దానివల్ల శరీరంలో సమతౌల్యం ఏర్పడుతుంది. ప్లీహం సాధారణంగా పక్కటెముకలకు కిందిభాగంలో ఎడమవైపు చిన్నగా ఉంటుంది. కాలేయంలో దీని పరిమాణం దాదాపు 20వ వంతు మాత్రమే ఉంటుంది. కానీ, ఈ బాలికకు పుట్టుకతోనే వచ్చిన ఓ సమస్య కారణంగా ప్లీహానికి రక్తం అధికంగా సరఫరా అయ్యి, అది అసాధారణంగా పెరిగిపోయి పక్కటెముకల నుంచి బొడ్డు వరకు విస్తరించింది. (స్ప్లెనోమెగలీ) ఉదరభాగాన్ని కూడా ఆక్రమించింది. అన్నం తినేటప్పుడు ఉదరభాగం వ్యాకోచించాలి. కానీ, ఇక్కడ అలాంటి అవకాశం లేకపోవడంతో.. ఆ పాప అన్నం సరిగా తినలేకపోయేది. ఫలితంగా ఎదుగుదల పూర్తిగా లోపించింది. దానికితోడు.. ప్లీహానికి రక్తసరఫరా ఎక్కువ కావడంతో అది అతిగా పనిచేసి రక్తకణాలను చంపేస్తుండటంతో ఆమెకు హిమోగ్లోబిన్, తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్లు అన్నీ పడి పోయాయి. బాలికకు ముందుగా ఎండోస్కొపీ చేసి చూస్తే, అన్నవాహికకు, ఉదరానికి మధ్య రక్తపు గడ్డలు కనిపించాయి. అక్కడి నుంచే ఆమెకు బ్లీడింగ్ అయింది. చిన్న పేగుల నుంచి కాలేయానికి వెళ్లే పోర్టల్ వెయిన్ అనే రక్తనాళం ఈమెకు పుట్టుకతోనే బ్లాక్ అయిపోయింది. అది కాలేయానికి రక్తం సరఫరా చేస్తేనే కాలేయం తన పని తాను చేయగలదు. ఈ పోర్టల్ వెయిన్ ఆమెకు బ్లాక్ అయిపోయింది. ఇంటివద్ద సాధారణ ప్రసవం అప్పుడు బొడ్డు సరిగా కట్ చేయకపోతే ఇలా రక్తనాళాలు బ్లాక్ అవుతాయి. దానివల్ల పోర్టల్ వెయిన్ చుట్టూ చిన్న చిన్న కాల్వలు తయారవుతాయిగానీ, అవి కాలేయానికి రక్తసరఫరా చేసేందుకు సరిపోవు. దాంతో రక్తం కాలేయానికి వెళ్లడానికి బదులు బయట గడ్డ కడుతుంది. సాధారణంగా ప్లీహం నుంచి, పేగుల నుంచి వచ్చే రక్తం పోర్టల్ వెయిన్ ద్వారా కాలేయానికి అందాలి. ఈ రెండు మార్గాలూ కలిసేచోట బ్లాక్ అయింది. దాంతో రక్తం వెనక్కి వచ్చి, ప్లీహానికి సరఫరా కావడంతో ప్లీహం అసాధారణంగా పెరిగిపోయింది. ప్లీహం నుంచి ఉదరానికి వెళ్లే రక్తనాళాలు లావుగా అయిపోయి, అన్నవాహిక వద్దకు వెళ్లడంతో రక్తపువాంతులు అయ్యాయి. బాలికకు ఉన్న ఈ సమస్యలన్నింటినీ ఒకేసారి శస్త్రచికిత్స చేయడం ద్వారా పరిష్కరించాం. ఇప్పుడు ఆ బాలిక వయసు 14 ఏళ్లు. సాధారణంగా అమ్మాయిలకు 17-18 ఏళ్లకు పెరుగుదల ఆగిపోతుంది. అప్పుడు ఇలాంటి శస్త్రచికిత్స చేసినా, ఇక ఎదుగుదల ఉండేది కాదు. ఇప్పుడు మిగిలిన మూడు నాలుగేళ్లలో ఆమె ఎంత పెరిగితే అంత పెరిగినట్లు. అదే 11 ఏళ్ల వయసులో వచ్చి ఉంటే మరింత ఎదుగుదల సాధ్యమయ్యేది. రక్తపు వాంతులు కాకుండా ఉన్నట్లయితే తల్లిదండ్రులు ఈ సమస్యను గుర్తించలేకపోయేవారు. ఇప్పుడు పాపకు పూర్తిగా నయం కావడంతో ఆమెతో పాటు తల్లిదండ్రులూ ఎంతో సంతోషిస్తున్నారని డాక్టర్ సూరా జానకిరామ్ వివరించారు.



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమా ఆధ్వర్యంలో ఖో ఖో క్రీడాకారులకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సందు నాయక్ తన సొంత నిధులతో బుధవారం పంపిణీ చేశారు. హెచ్ఎం ఉమా మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలలో ఆసక్తి కనపరచాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి కేంద్ర రాష్ట్ర ఉద్యోగాలలో తగిన రిజర్వేషన్లు ఉంటాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలను అలవాటు చేసుకోవాలని ఆమె కోరారు. ఉపాధ్యాయులు గఫూర్, రాజ మోహన్, రంగ స్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఉచితంగా దుస్తుల పంపిణీ చేసిన ఫిజికల్ డైరెక్టర్ సందు నాయకులు ఉపాధ్యాయులు అభినందించారు.

22 నుంచి జాతీయ స్థాయి మహిళ కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామంలో శ్రీ చౌడేశ్వరి దేవి ఉగాది ఉత్సవా సందర్భంగా మార్చి 22 నుంచి 23 వరకు జాతీయ స్థాయి మహిళా కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను రాష్ట్ర అడహక్ కమిటీ కబడ్డీ చైర్మన్ ,పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ఆవిష్కరించినట్లు తెలిపారు. కబడ్డీ పోటీలను రాష్ట్ర అడహక్ కమిటీ కబడ్డీ చైర్మన్, ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభిస్తారని అన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, శ్రీశైలం ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, పత్తికొండ రూరల్ సిఐ రామకష్ణారెడ్డి, జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు పాల్గొంటారన్నారు. ఈ పోటీలలో మొదటి విజేతకు వైసిపి నాయకుడు కడమకుట్ల అమర్నాథ్ రెడ్డి రూ. 75వేలు, రెండో విజేతకు వైసిపి నాయకుడు రాతన ఉమామహేశ్వర్ రెడ్డి రూ. 50 వేలు, మూడో విజేతకు కడమకుంట్ల సచివాలయ వాలంటీర్లు రూ. 30 వేలు, నాలుగో విజేతకు బాసాని లక్ష్మీనారాయణ రెడ్డి, బాసాని రామ్మోహన్ రెడ్డి లు రూ. 20 వేలు, ఐదో విజేతకు మాజీ ఎంపిటిసి ఎం.రామాంజనేయులు రూ. 10 వేలు నగదు బహుమతులు అందిస్తారన్నారు. వివరాల కోసం,7780248219 ,6281999137 సెల్ నెంబర్స్ ని సంప్రదించాలని కోరారు.

98 ఉపాధ్యాయులకు పోస్టింగ్

ఉత్తర్వులు జారీ చేసిన విద్యా శాఖ : 625 మందికి నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నటువంటి డిఎస్‌సి-98 ఉపాధ్యాయులకు ఎస్‌జిటి కింద పోస్టింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ కింద పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో మొత్తం 625 మంది డిఎస్‌సి- 98 కింద ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. గత ఏడాది సెప్టెంబర్లో 98 అభ్యర్థులకు పోస్టింగులు కల్పించేందుకు అర్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేశారు. ఇటీవల జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు , ఎస్‌జిటి లకు తాత్కాలికంగా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల ప్రక్రియను విద్యాశాఖ పూర్తి చేసింది. ఇందులో భాగంగా దాదాపుగా పెద్ద ఎత్తున పాఠశాలల్లో ఎస్‌జిటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులలో 98 డిఎస్‌సి అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజాశక్తి
గురువారం 16 మార్చి 2023
5
నంద్యాల





సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ఈ సారైనా ఇస్తారా..?

- జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు
- ఈ బడ్జెట్‌పై కొత్త జిల్లా వాసుల ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు కదలడం లేదు. గత కొన్నేళ్లుగా రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడంతో ఏ ప్రాజెక్టూ ముందుకు సాగడం లేదు. చాలా ప్రాజెక్టులు శంకుస్థాపనకే పరిమితం అయ్యాయి. గురువారం రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన జిల్లా అభివృద్ధికి నిధులు ఇస్తారా? లేదా? అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు....

గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టుల అంచనాలను పక్కనబెట్టి మొక్కుబడిగా నిధులు కేటాయించారు.

సాగని జొలదరాసి

కోవెలకుంట్ల మండలం జొలదరాసి పైలెట్ ప్రాజెక్టుకు 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంవత్సరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూమి పూజ చేసినా ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. భూసేకరణ కూడా జరగలేదు. ఆళ్లగడ్డ, శిరివెళ్ల, చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో తెలుగు గంగ లైనింగ్ పనులు ముందుకు సాగడం లేదు.

రాజోలికి పడని అడుగులు

చాగలమర్రి మండలంలో రాజోలి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌కు అడుగులు పడలేదు. ప్రతి ఏటా కుందూ నది నుంచి వచ్చే వరద నీరు సోమశిలకు చేరి, ఆ తరువాత సముద్రంలో కలిసి వృథా అవుతోంది . దీంతో రాజోలి వద్ద 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. 2008 డిసెంబరు 24న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశే ఖర్ రెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాతి ప్రభుత్వాలు పట్టించుకోకపోవ డంతో నీటి వృథా కొనసాగుతోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకా 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి జీవో ఇచ్చారు. రూ .1,357.10 కోట్లతో చేపట్టే పనులకు జ్యుడీషియల్ ప్రివ్యూ ఆమోదం లభించింది. ఈ పనులకు జలవనరుల శాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అయినా ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు.

మారని 'నూతన' పాలన

గతేడాది ఉగాది రోజున రాష్ట్రంలో నూతన జిల్లాలను ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో భాగంగా ఉన్న నంద్యాల కొత్త జిల్లాగా ఏర్పడింది. నూతన జిల్లా ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా జిల్లాలో పాలన స్తబ్ధతగా సాగుతోంది. జిల్లా కార్యాలయాలకు కావలసిన మౌలిక సదుపాయాలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రభుత్వం కల్పించలేదు. జిల్లాలకు ప్రధాన పరిపాలనా విభాగమైన కలెక్టరేట్‌కు ఆర్‌ఎఆర్‌ఎస్‌లోని ల్యాబొరేటరీలో 3 గదులను కేటాయించారు. కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ ఛాంబర్‌లను అక్కడ ఏర్పాటు చేశారు. అవసరమైన మౌలిక వసతులేవీ అక్కడ లేవు. సరిపడా గదులు లేకపోవడంతో డిఆర్‌ఒ కార్యాలయ సిబ్బంది నంద్యాల ఆర్‌డిఒ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ కూడా కనీస సదుపాయాలేవీ లేవు. పలు కార్యాలయాల్లో నేటికీ ఇంకా అరకొర సౌకర్యాలే ఉన్నాయి. అనేక జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస వసతులు లేవు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ, కార్మిక కర్షక మహా ర్యాలీ

- జయప్రదం చేయండి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - నంద్యాల

రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు ఇచ్చే విధంగా పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ, కార్మిక కర్షక మహార్యాలీలో నంద్యాల జిల్లా రైతాంగం పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం నేతలు కోరారు. బుధవారం నంద్యాలలోని టి.నరసింహయ్య భవన్‌లో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతాంగం పండిస్తున్న అన్ని రకాల పంటలకు ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా మద్దతు ధరలను నిర్ణయించి ఆదుకునేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ ఏప్రిల్ 5న అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు సంఘం కార్యకర్తలందరూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సభలు, సమావేశాలు, కరపత్రాలు, జీపు జాతాల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ వినాశకర రైతు చట్టాలకు వ్యతిరేకంగా జిల్లాలోని రైతులందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. పెరిగిన సేద్యపు ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, తగ్గుతున్న పంట దిగుబడులు, గిట్టుబాటు కానీ ధరల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. చేసిన అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్లు ఉన్నాయని విమర్శించారు. వ్యవసాయ రంగంలో సబ్సిడీలు పెంచకపోగా గతం కంటే బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయించి రైతాంగాన్ని మోసం చేస్తుందని అన్నారు. లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టుతున్న కేంద్ర ప్రభుత్వం రైతులను రుణభారం నుండి ఆదుకునేందుకు పంట రుణాలను రద్దు చేయమని కోరితే ఒక్క నయా పైసా కూడా చెల్లించలేదన్నారు. కావున రైతు లందరూ రాజకీయాలకతీతంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తేలనున్న మండలి భవితవ్యం

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శాసనమండలి భవితవ్యం గురువారం తేలనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి స్థానంతో పాటు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలకు ఈ నెల 13న పోలింగ్ నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో చేపట్టనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపును కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపును ప్రారంభించనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితం గురువారం మధ్యాహానికి తేలనుంది. స్థానిక సంస్థల స్థానానికి కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయాల్లో, నంద్యాల జిల్లాలో నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 1178 మంది ప్రజాప్రతినిధులకు గాను 1136 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96.43 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల జిల్లాలో 578 మంది ప్రజాప్రతినిధులకు గాను 557 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.37 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 1756 మందికి గాను 1693 మంది ఓటు వేశారు. పట్టభద్రులకు సంబంధించి కర్నూలు జిల్లాలో 71.30 శాతం, నంద్యాల జిల్లాలో 77.03 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులకు సంబంధించి కర్నూలు జిల్లాలో 90.30 శాతం, నంద్యాల జిల్లాలో 94.01 శాతం మంది ఓటు వేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి సంవత్సరం విద్యార్థులు 452 మంది గైర్హాజరు - కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షకు విద్యార్థులు 11,437 మందికి గాను 10,985 మంది హాజరయ్యారు. 452 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ఎలాంటి మాస్ కాపీ జరగకుండా మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు డివిఇఒ సునీత తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్‌పి

నంద్యాల పట్టణంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, ఎస్పి కె. రఘువీర్ రెడ్డిలు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. **బేతంచర్ల :** మండలంలోని గోరుమానకొండ గ్రామం సమీపంలోని ఎపి మోడల్ స్కూల్, బేతంచర్లలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను సిఐ ప్రియతమ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్, ఆర్ఐ శ్రీదేవిలు పరిశీలించారు. మండలంలో దాదాపు 500 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలియజేశారు. **బండి ఆత్మకూరు :** బండి ఆత్మకూరులోని జూనియర్ కళాశాలలో జరిగిన పబ్లిక్ పరీక్షలకు 124 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 121 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ వెంకట నారాయణ తెలిపారు. **పాములపాడు :** పాములపాడు ఏపి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు మొదటి లాంగ్వేజ్ తెలుగు పరీక్షకు 113 మంది హాజరు కావాల్సి ఉండగా 109 మంది హాజరయ్యారని, నలుగురు గైర్హాజర్ అయినట్లు ఎగ్జామ్ చీఫ్ నాగ రవీంద్రుడు, డిపార్మెంటల్ అధికారి రామలింగయ్యలు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఆత్మకూరు డిఎస్పి శృతి, పాములపాడు తాసిల్దార్ రత్న రాధిక పరిశీలించారు. ఎగ్జామ్ కేంద్రం వద్ద ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని శ్రీ వాసవి జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షలకు 321 గాను 294 మంది విద్యార్థులు హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ రమణాకుమారి, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్, ప్రిన్సిపల్ శివ రామిరెడ్డిలు తెలియజేశారు. పరీక్షా కేంద్రాన్ని ఆళ్లగడ్డ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు.



నంద్యాలలో న్యూక్లియస్ కాలేజీలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి బయట కు వస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

ట్రాప్ కెమెరాకు చిక్కిన 3 పులులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలంలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో మూడు పులులు కనిపించాయి. మంగళవారం రాత్రి కెమెరాల్లో మూడు పులులు సంచరిస్తున్నట్లు, అందులో రెండు ఆడ, ఒకటి మగ పులి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని స్థానిక అటవీ అధికారులు ధ్రువీకరించారు. కొత్తపల్లి మండలం గుమ్మడాపురం గ్రామ సమీపంలో ఇటీవల 4 ఆడ పులి కూనలను గ్రామస్తులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు అప్పజెప్పిన విషయం పాఠకులకు విధితమే. ఆ నాలుగు పులికూనాలను తల్లి పులి వద్దకు చేర్చేందుకు అటవీ శాఖ అధికారులు నాటి నుండి తల్లి పులి జాడ కోసం అటవీ శాఖ అధికారులు శివపురం, మాడుగుల, గుమ్మడాపురం, ముసలమడుగు తదితర గ్రామ సమీప అడవిలో ప్రత్యేకంగా ట్రాప్ కెమెరాలను అమర్చారు.

పారిశుధ్య చర్యలు ముమ్మరం : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టణంలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేసి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపల్ కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలిస్తూ ఎవరెవరు ఏఏ పనులు చేస్తున్నారని ఆరా తీశారు. కార్యాలయం అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణంలో పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోందని, చర్యలు ముమ్మరం చేసి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. స్పందన ఫిర్యాదులు, సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు నిర్ణీత కాలవ్యవధిలోగా ధ్రువపత్రాలు అందించాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి : ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి - శిరివెళ్ల



మండలంలోని అయా గ్రామాలలో గృహ, వ్యాపార కేంద్రాల యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామపంచాయతీల రెవెన్యూ ఆదాయానికి సహకరించాలని ఇఒపిఆర్‌డి సాల్మన్ రాజ్ పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, గోవిందపల్లె గ్రామాలలో బుధవారం వరకు వసూలు చేసిన హౌస్ టాక్స్‌ల వివరాలను ఆయా గ్రామ పంచాయతీల బిల్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరి నాటికి హౌస్ టాక్స్ వసూలు చేయాలని పంచాయతీ ఈఓలు వెంకటేశ్వర్లు, మనోహర్, సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యంలకు సూచించారు. శిరివెళ్ల మేజర్ పంచాయతీతో పాటు యర్రగుంట్ల గ్రామంలో సైతం పారిశుధ్య పనులు నిరంతరాయంగా ప్రతి రోజు కొనసాగుతున్నాయని, పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : తహశీల్దార్

ప్రజాశక్తి - శిరివెళ్ల



భాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. బాల్య వివాహానికి సిద్ధమవుతున్న ఒక కుటుంబాన్ని శిరివెళ్ల పోలీసులు అదుపులోకి తీసుకుని బుధవారం తహశీల్దార్ ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పాతకాలపు రోజుల్లో కొన్ని ఉద్దేశ్యాలతో బాల్య వివాహాలు జరిపేవారన్నారు. కాలగమనంలో కలిసిపోయిన అనారోగ్యకర వాతావరణంతో పాటు, ప్రతిబంధకాలను నిరోధించేందుకు బాల్య వివాహాల నిరోధక చట్టం తీసుకొచ్చారన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహాలు జరిపితే విచారణ వేగవంతంగా జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు 'వివేకానంద'లో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడులోని శ్రీ వివేకానంద విద్యా విహార్ పాఠశాలలో నేడు సైన్స్ విజ్ఞాన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ ఆర్‌ఎస్‌ఆర్ గోపాల్, ఎఒ దేవిక తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సైన్స్ విజ్ఞాన ప్రదర్శన పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేటి నుండి 18వ తారీకు వరకు ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను పలువురు మండల స్థాయి అధికారులు విద్యాధికారులు సందర్శించనున్నట్లు చెప్పారు. ప్రదర్శన ముఖ్య ఉద్దేశం శాస్త్రపరంగా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడం, వారిని ప్రోత్సహించడానికి అన్నారు.

హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచండి : జడ్జి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంలో విద్యను అభ్యసిస్తున్న బాలికలు సమస్యలు ఉంటే అధికారులకు చెప్పాలని, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కొత్తపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను విడిచి హాస్టల్లో ఉంటున్న బాలికలందరూ మంచి ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలన్నారు. విద్యార్థులకు ఇస్తున్న భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఇన్చార్జి ఎస్ఐ రామ్ నాథ్, న్యాయవాదులు నాగేష్, మాణిక్యరావు, రంగస్వామి, హుస్సేన్ మియా, ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



భోజనశాలను పరిశీలిస్తున్న జడ్జి

జడ్పిటిసి చొరవతో బస్సు సౌకర్యం

ప్రజాశక్తి - అవుకు

దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి సతీమణి అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి చొరవతో కోవెలకుంట్ల పట్టణం నుండి సంజామల మండలం ముదిగేడు, కమలాపురి, వసంతాపురం, శివవరం, చెన్నంపల్లి మీదుగా అవుకు పట్టణానికి బస్సు సౌకర్యాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మికి తెలపడంతో ఈ విషయాన్ని రీజినల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన రీజనల్ మేనేజర్ కోవెలకుంట్ల నుండి అవుకు పట్టణానికి వయా ముదిగేడు, వసంతాపురం, శివవరం, చెన్నంపల్లి మీదుగా బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు చల్లా శ్రీలక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో కూడా మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యాలను దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి ఏర్పాటు చేయించారని, మళ్లీ ఇప్పుడు ఆ కుటుంబంలోని చల్లా శ్రీలక్ష్మి ఏర్పాటు చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభమైన బస్సు సర్వీసు



ఒంటి పూట బడులపై స్పష్టత ఇవ్వాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఒంటిపూట బడులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు అజాంబేగ్, ప్రధాన కార్యదర్శి మౌలాలిలు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని ఎస్‌టియు కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి విద్యా సంవత్సరం మార్చి 15 నుండి ఒంటి పూట బడులు నిర్వహించేవారని, ఈ సంవత్సరం 15వ తేదీ దాటిన ప్రభుత్వం నుండి పూట బడులు ఎప్పటి నుంచి నిర్వహిస్తారో ప్రకటించలేదన్నారు. వేసవి వడగాల్పుల తీవ్రత దృష్ట్యా విద్యాశాఖ అధికారులు పాఠశాలల సమయ వేళల్లో మార్పులు చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో సహాధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఈవి. గోపాలకృష్ణ, సీనియర్ నాయకులు సుంకన్న, నాగేశ్వర్ నాయక్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వస్తువులు కొనేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - డోన్

ఏ షాపులో అయినా వస్తువులు కొనేటప్పుడు వినియోగదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ఆవరణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు వస్తువును కొనుగోలు చేసినప్పుడు దానిని తయారు చేసిన తేదీ, ఎక్స్పైర్ తేదీని గమనించాలన్నారు. బిల్లు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మెడిసిన్ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. మినరల్ వాటర్ కొనేటప్పుడు ఐఎస్ఐ మార్కు ఉన్న బాటిల్ తీసుకోవాలన్నారు. బంగారు, వెండి వస్తువులు కొనేటప్పుడు హాల్ మార్క్ గమనించా లన్నారు. అలాగే విత్తనాలు, ఎరువులు, మందులు కొన్నప్పుడు కూడా జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్, రవిశేఖర్, వెంకట లక్ష్మీ,వెంకట రమణ, లక్ష్మయ్య, చంద్రశేఖర్ గౌడ్, సుబ్బారెడ్డి, రాధ, అనంత శ్రీనివాసులు, అల్లిపీరా, లక్ష్మి కాంతరెడ్డి, సుభాన్, మధుసూదన్ రెడ్డి, మద్దిలేటి, భూకాంతరెడ్డి, జయ సుబ్బా రాయుడు, శివన్న, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, శ్రీకళ, భారతి, రమేష్, సంజీవరెడ్డి, దేవేంద్రప్ప, రాఘవేంద్ర, రామ్మూర్తి, సుబ్బ రాయుడు, శ్రీనివాసులు, భాను ప్రకాష్ రెడ్డి, లక్ష్మి ప్రభావతి, మునిరాజు, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి



బాధితురాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ హరినారాయణ తదితరులు

వైఎస్ఆర్ బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని టి.లింగందిన్నె గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి వైయస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలు పరిహారాన్ని వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ హరి నారాయణ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన లింగమయ్య గుండెపోటుతో మృతి చెందారన్నారు. దీంతో అతని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ శశిరేఖ, వివోఏ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

విధులు పట్ల ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీవో సుబ్బరాజు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అందరూ ఉదయం 10:15 గంటలకు, సాయంత్రం 5.15 తరువాత బయో మెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఫీ, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

బి.నాగిరెడ్డిపల్లె విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని బి.నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏగ్గోని గురు ప్రసాద్ పీజీ సీటు సాధించి ప్రతిభను చాటారు. గ్రామానికి చెందిన వీఆర్వో యగ్గోని జయన్న, లక్ష్మీదేవిల కుమారుడు యగ్గోని గురు ప్రసాద్ ఇటీవల నిర్వహించిన ఎంబిబిఎస్ పీజీ పోటీ పరీక్షల్లో 4900 ర్యాంకు సాధించి 573 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి పీజీ సీటు సాధించడం పట్ల గ్రామానికి చెందిన పలువురు పెద్దలు అభినందనలు తెలియజేశారు.



ఎంబిబిఎస్ ఉత్తీర్ణత పత్రాన్ని అందు కుంటున్న గురు ప్రసాద్‌తో తల్లిదండ్రులు జయన్న, లక్ష్మీదేవి


విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

నులి పురుగుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - డోన్

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా డోన్‌లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి సిబ్బంది మాట్లాడుతూ నులి పురుగుల ద్వారా రక్తహీనత దారి తీస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. పిహెచ్‌సి సిబ్బంది ప్రభాకర్, సాయి వాణి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గీత, హెల్త్ సూపర్వైజర్ పుష్పవతి పాల్గొన్నారు.

డ్రోన్ పైలెట్ ట్రైనింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్లలోని శేషారెడ్డి హైస్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో ఏపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రోన్ పైలెట్ ట్రైనింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కిల్ డెవలప్మెంట్ శిక్షకులు దస్తగిరి, సుల్తాన్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ పదవ తరగతి పాస్ అయిన వారికి ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పొందాలనుకున్నవారు ఈ నెల 17వ తేదీ లోపల పదవ తరగతి ఉత్తీర్ణత పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించాలన్నారు. ఇప్పటికే 32 మంది డ్రోన్ పైలెట్ శిక్షణ తీసుకొని పలు కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. పదవ తరగతి పాసైన నిరుద్యోగ యువతీ యువకులు తమ పూర్తి బయోడేటాతో ఈ నెల 17వ తేదీ లోపు అందజేయాలన్నారు. మిగతా పూర్తి వివరాలకు 9603437726 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హుండీ కానుకలు లెక్కింపు

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

మండలంలోని కృష్ణనంది క్షేత్రంలో వెలసిన విష్ణు నందీశ్వర స్వామి ఆలయం హుండీ కానుకలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామాంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఆలయాల ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. భక్తులు గతేడాది శివరాత్రి నుంచి ఇప్పటివరకు సమర్పించిన కానుకలను లెక్కించగా 96 వేల 603 రూపాయలు నగదు వచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి సుమారు రూ. 43 వేలు ఆదాయం పెరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు తిరుపం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పల్లె నాగమణి, స్థానికులు కృష్ణవేణి, సోమశేఖర్ రెడ్డి, ఆదిలక్ష్మి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అర్చకులు మనోహర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


దేవస్థానం హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పాదయాత్రికులు శుభ్రత పాటించాలి

- కైలాస ద్వారం వద్ద ఏర్పాట్లను ఇఒ పరిశీలన

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్న భక్తులు శుచి, శుభ్రతను పాటించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి లవన్న సూచించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో ఈ నెల 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. మహోత్సవాలలో స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో పాదయాత్రగా భక్తులు శ్రీశైలం చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా బుధవారం కైలాస ద్వారం వద్ద భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి లవన్న సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని సూచించారు. అటవీ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కైలాస ద్వారం వద్ద చలువ పందిళ్ళు, మంచినీటి సౌకర్యం, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భీమని కొలను వద్దకు పైపుల ద్వారా మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కన్నడిగులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని పరిశీలించారు. అన్నదాన కార్యక్రమానికి కావాల్సిన సహాయ సహకారాలు దేవస్థానం ఏర్పాట్లపై ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లు తృప్తికరంగా ఉన్నాయని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీర్ రామకృష్ణ, ఏఈఈ ప్రసాద్, శ్రీశైల ప్రభ ఎడిటర్ డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యూలైన్లను ఇఒ పరిశీలన : స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లను ఇఒ లవన్న సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్యూలైన్లో వేచి ఉండే భక్తులకు మంచినీరు, అల్పాహారం, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. శీఘ్ర, అతి శీఘ్ర టికెట్ల కోసం భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కన్నడ భాషలో మైకు ద్వారా తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు.


మాట్లాడుతున్న ఇఒ లవన్న

ఘనంగా కాన్షిరాం జయంతి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

బిఎస్‌పి వ్యవస్థాపకులు కాన్సిరాం 89వ జయంతిని బుధవారం నంద్యాల పట్టణంలోని ఎమ్మార్పిఎస్ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎసి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ బహుజన పితామహుల ఆలోచన విధానాన్ని భారతదేశం అంతటా విస్తరించి, ఉత్తరప్రదేశ్లో కుమారి మాయావతిని ఐదుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన ఘనత మాన్య శ్రీ కాన్సిరాంకి దక్కుతుందన్నారు. రాష్ట్ర న్యాయ సలహా అధ్యక్షులు డా. జి.బాలస్వామి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ బహుజనులందరూ రాజ్యాధికారం సాధించే దిశలో పయనించా లన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్ మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోయిలకుంట్ల : మండలంలోని బిజినవేముల గ్రామంలోని ఎస్సీ కాలనీలో మాన్యశ్రీ కాన్సిరాం 89వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బీఎస్పీ నియోజక వర్గ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కాన్సిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేంద్ర, సురేష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు : బిఎస్‌పి వ్యవస్థాపకులు కాన్సిరాం జయంతిని జిల్లా అధ్యక్షులు మహేంద్ర, నియోజకవర్గ అసెంబ్లీ ఇన్చార్జి స్వాములు, జిల్లా ఇన్చార్జి లాజర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.


కోవెలకుంట్ల : నివాళులర్పిస్తున్న నాయకులు

ఓటరు ఐడికి ఆధార్ అనుసంధానం చేయండి : తహశీల్దార్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఓటరు ఐడికి ఆధార్ అనుసంధానం చేయాలని తహశీల్దార్ దోని ఆల్‌ఫ్రెడ్ అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అధ్యక్షతన బూత్ లెవెల్ ఆఫీసర్‌లతో ఓటరు ఐడికి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయడంపై గ్రామాలలో బూత్ లెవెల్ ఆఫీసర్స్ వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడివో సుబ్బరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లడుతూ ఓటర్ ఐడికి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయు కార్యక్రమం వేగవంతం చేయాలని, పెండింగ్ ఉండకూడదన్నారు. ప్రతి బూత్ లెవెల్ ఆఫీసర్స్ 95 శాతం పూర్తి చేయాలని, అలా చేయని పక్షంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఫీ, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాముడు, బిఎల్‌వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చాగలమర్రి : మండలంలోని ఓటరు కార్డు కలిగిన వ్యక్తుల ఆధార్ సీడింగ్ వెంటనే పూర్తి చేయాలని తహసీల్దారు విజయ్ కుమార్ బీఎల్వోలకు సూచించారు. చాగలమర్రి పట్టణంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో బీఎల్‌వోలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండల వ్యాప్తంగా 40145 మంది ఓటర్లు ఉండగా 25850 మంది ఓటర్లకు సంబంధించి ఆధార్ సీడింగ్ ఇప్పటి వరకు పూర్తైందన్నారు.

నీట్, పీజీ పోటీ పరీక్షల్లో మండల విద్యార్థినిలు ప్రతిభ

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలంలోని తిమ్మాపురం, అల్లీనగరం గ్రామానికి చెందిన సి.రజియా, డి. సుస్మాలు డాక్టర్ భాటియా మెడికల్ కోచింగ్ ఇన్స్టిట్యూట్, పద్మారావు నగర్, సికింద్రాబాద్, హైదరాబాద్‌లో శిక్షణ పొంది పీడియాట్రిక్స్‌లో సీట్లు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.

తిమ్మాపురం గ్రామానికి చెందిన కొచ్చర్ల హుస్సేని, హుస్సేనమ్మ దంపతుల కూమార్తె సి.రజియా కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుకుంటూ 619 మార్కులతో 1368 ర్యాంకును, అల్లినగరం గ్రామానికి చెందిన చిన్న మాబు హుస్సేన్, ఆశా బేగం దంపతుల కూమార్తె డి. సుస్మ అనంతపురం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుకుంటూ 571 మార్కులతో 5248 ర్యాంకు సాధించారు. ఇటీవల నిర్వహించిన నీట్, పీజీ 2023 పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థినిలు నీట్, పీజీలో సీట్లు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

ఎస్ఎస్‌సి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఏప్రిల్ 3 నుండి 18వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతికి సంబంధించి 125 కేంద్రాల్లో 25,411 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు రాస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులకు కేటాయించిన విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నిరు. కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు డిప్యూటీ తాసిల్దార్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్‌లో నియమించాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. పరీక్షలు ముగిసిన తర్వాత సమాధాన పత్రాలను పార్సెల్ ద్వారా డిస్పాచ్ చేసేందుకు సాయంత్రం 4 గంటల వరకు అనుమతించాలని పోస్టల్ అధికారులను ఆదేశించారు. డిఇఒ అనురాధ మాట్లాడుతూ చీఫ్ సూపర్డెంట్లు, కస్టోడియన్ అధికారులు, డిపార్ట్మెంట్ అధికారులు, ఎంఈఓలకు 10వ తరగతి పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటనరీ హాలులో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని కలెక్టర్‌కు నివేదించారు.


ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలలో పాల్గొన్న సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ తదితరులు

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి : సిఐ

ప్రజాశక్తి - పాణ్యం

మారుతున్న సమాజంలో పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలని పాణ్యం సిఐ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పాణ్యంలోని జ్వాలా స్కూల్‌లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సిఐ, ఎస్ఐలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆధునిక కాలంలో పిల్లలు సెల్‌పోన్‌లను అధికంగా వినియోగించడం వల్ల అటు కంటి చూపు మందగిస్తు, ఇటు చదువు పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. పిల్లల ప్రవర్తనపై పెద్దలు ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. వారిని తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై కూడా వుందని అన్నారు. జ్వాలా స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ఈ రోజు పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను బయటకు తీయడానికి మా పాఠశాల ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని, అనతి కాలంలోనే పాఠశాలకు మంచి పేరు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

నిర్వహణ నిధులు విడుదల చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు సంబంధించిన 2022-2023 నిధులను వందశాతం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, సిపిఎస్ కన్వీనర్ చిన్నపరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి మిగతా 80 శాతం నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో హాజీ మస్తాన్ వలి, మహబూబ్ బాషా, టివి రమేష్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు మల్లేష్, మురళి, నాగుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

- కోవెలకుంట్ల క్లస్టర్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా సాంబ శివరావు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పండ్ల తోటలు విరివిగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని కోవెలకుంట్ల క్లస్టర్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా సాంబ శివరావు అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల ఎంపిడివో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లడుతూ మార్చి 31 నాటికి లేబర్ బడ్జెట్ 100 శాతం పూర్తి చేయాలని, దీని కొరకు ప్రణాళిక బద్ధంగా ఇప్పటికే 85 రోజులు పూర్తి చేసుకున్న గ్రామంలో కూలీలను ఉపాధి పనులకు హాజరు అయ్యేలా చూసుకొని వారికి 100 రోజులు పని కల్పించాలన్నారు. హౌసింగ్ ప్లాంటేషన్, అమృత్ సరోవర్ చెరువులను కూడా కూలీలతో పని చేయించాలని, ఏప్రిల్ 1 నుండి ఆధార్ బేస్డ్ పేమెంట్ కావున కూలీలందరికి 100 శాతం ఆధార్ సీడింగ్ చేయించాలన్నారు. గ్రామంలోని రైతులకు ప్రభుత్వం ఉచితంగా వైఎస్ఆర్ జల కళ కింద బోరు వేయించుకున్న లబ్ది దారులందరికి ఫారం పాండ్స్ పైన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ ధోనీ ఆల్ ఫ్రెండ్, ఎంపిడివో సుబ్బరాజు, ఎపిఒ అధికారి గంగన్న, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రాజ బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాంబ శివరావు

21న ధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 21న డిఎంహెచ్ఒ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కె.భాస్కర్ రెడ్డి కోరారు. బుధవారం బ్రాహ్మణకొట్కూరు పిహెచ్‌సి సెంటర్‌లో డాక్టర్ సుబ్రహ్మణ్యంకు పర్మిషన్ లెటర్ సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. 12 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో గర్భవతులు, బాలింతలు, పసిపిల్లలకు సంరక్షణతో పాటు ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా చూస్తున్నారని చెప్పారు. కుటుంబ నియంత్రణ, న్యూట్రిషన్, పరిసరాల పరిశుభ్రత వంటి పనులతో పాటు జనన, మరణాలు, మలేరియా, క్షయ, కుష్టు, ఫైలేరియా ఎయిడ్స్ వంటి రోగులకు అందుబాటులో ఉండి నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పారితోషికం పేరుతో ఆశ వర్కర్లను మోసం చేస్తుందన్నారు. పనికి తగ్గ వేతనం అందకపోవడం దుర్మార్గమన్నారు. ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించి, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత పని ప్రదేశాలలో సౌకర్యాలు కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న డిఎంహెచ్వో కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఆశ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షురాలు ఆర్ జయ, ఆశ వర్కర్లు ఉమాదేవి, మేరీ, విజయ, శ్రీలత, ప్రమీలమ్మ, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల చివరికి లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల చివరి నాటికి టిడ్కో గృహాల్లోని డబల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నీసా తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్లతో కలిసి చైర్ పర్సన్ వైఎస్ఆర్ నగర్, నందమూరి నగర్‌ల సమీపంలో డబల్ బెడ్ రూమ్ టిడ్కో గృహాలను పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జనవరిలో ఎమ్మెల్యే సహకారంతో మంత్రుల చేతుల మీదుగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేశా మన్నారు. ఇంకా మిగిలిన టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టిన లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ రమణ మూర్తి, డిఈఈ శ్రీనివాసరెడ్డి, టిడ్కో అధికారులు పాల్గొన్నారు.


టిడ్కో ఇళ్ల ను పరిశీలిస్తున్న చైర్ పర్సన్, కమిషనర్

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ సబ్ డివిజన్లో మద్యం (ఎక్సైజ్) కేసులలో సెబ్ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలకు నేడు గురువారం వేలం వేయనున్నట్లు డీఎస్పీ సుధాకర్ రెడ్డి బుధవారం తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ నేడు ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బైకులు 43, ఆటోలు 2, కారు 1 మొత్తం 46 వాహనాలకు మధ్యాహ్నం 1 గంటకు వేలంపాట వేయనున్నామన్నారు. వేలంపాటలో వాహనం దక్కించుకున్న వ్యక్తి పాడిన వేలం డబ్బుతో పాటు జీఎస్టీ కూడా చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కొరకు ఆళ్లగడ్డ డిఎస్‌పి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పట్టుబడిన వాహనాలకు 17న వేలం

బనగానపల్లె : డోన్ సబ్ డివిజన్ పరిధిలోని బనగానపల్లె పోలీస్ స్టేషన్‌లో మద్యం (ఎక్సైజ్, సారా) కేసులలో పట్టుబడిన బైకులు, ఆటోలు, కార్లకు డోన్ డిఎస్‌పి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 17న వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొని వాహనం దక్కించుకున్న వ్యక్తి వారు వేలం డబ్బుతో పాటు జిఎస్‌టి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో బైకులు 16, ఆటోలు 4, కారు 1 మొత్తం 21 వాహనాలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ 9121101124 సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానంలోని ఇంజనీరింగ్ భాగంలో కాంట్రాక్టు పద్ధతిపై డి రాము విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో జనవరి 30న మరణించారు. రాము కుటుంబానికి ఆర్థిక సహాయంగా బుధవారం శ్రీశైల దేవస్థానంలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవలందిస్తున్న సిబ్బంది వారి నెలవారి జీతం నుండి ఒక్కరోజు వేతనాన్ని మొత్తం రూ.2,72,969 డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రాము భార్య డి.కనకదుర్గకు దేవస్థానం ఇఒ లవన్న చేతుల మీదుగా అందజేశారు.

వీధి కుక్కల నుండి ప్రజలను కాపాడాలని వినతి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన వీధి కుక్కల నుండి చిన్నారులను, ప్రజలను కాపాడాలని కోరుతూ బుధవారం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ వామపక్ష పార్టీ (ఏఐఎఫ్‌బి) నేతలు బుధవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌బి రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు, ప్రజా సంఘాల నేత ఇల్లూరి భూపాల్ మాట్లాడుతూ నంద్యాల పెద్దాసుపత్రిలో ప్రతి నిత్యం 30 నుండి 40 వీధి కుక్కలు కరిచిన కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ లాంటి సంఘటనలు నంద్యాలలో పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రి 9 దాటితే ఇళ్లకు వెళ్లాలంటే ప్రధాన కూడళ్లలో పదుల సంఖ్యలో వీధి కుక్కలు ఉంఉటన్నాయని, మనిషి కనబడితే విచక్షణా రహితంగా దాడి చేస్తున్నాయని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

సాంప్రదాయాలను ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి - బనగానపల్లె

భారతదేశ సాంప్రదాయాలను ప్రోత్సహిద్దామని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలో రామాలయంలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో సిద్ధాంతి పీవీ లక్ష్మీనరసయ్య 23-2024 ఆవిష్కరణ, పంచాంగ కర్తకు సన్మానం చేశారు. అనంతరం పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందచారి మాట్లాడుతూ భారతదేశ సంప్రదాయాలను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకొని పాటిస్తున్నాయన్నారు. పంచాంగ కర్త లక్ష్మి నరసయ్య మాట్లాడుతూ తాను రాసిన పంచాంగాన్ని ఆవిష్కరించి తనన్ను సన్మానించిన బ్రహ్మానందచారికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాష అభివృద్ధి సంఘం అధ్యక్షుడు బాల హనుమంతు, సెక్రటరీ రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

క్రీడలతో మానసిక ఉల్లాసం : చైర్మన్

ప్రజాశక్తి - డోన్

క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఉత్సాహానికి ఎంతో దోహదపడతాయని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డోన్ మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు గురువారం పొదుపు లక్ష్మి సభ్యులకు డోన్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు నెహ్రూనగర్ మున్సిపల్ పార్క్ వద్దకు పొదుపు లక్ష్మి మహిళలు రావాలన్నారు. షాట్ పుట్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, కబడ్డీ, టెన్నికాయిట్ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల : ఉపాధి పనులు కొలతల ప్రకారం చేస్తే రోజుకు రూ.257 వేతనం పడుతుం దని ఎంపిడిఒ వెంకట రమణ కూలీలకు సూచించారు. బుధవారం మండలంలోని లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం గ్రామాల్లోని ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. కూలీలు వలసలు పోకుండా పనులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని మేటీలకు ఆదేశించారు. కొలతలు కొలుసుకుని పనులు చేసినప్పుడు అధిక వేతనం వస్తుందన్నారు. అనంతరం పండ్ల తోటలను పరిశీలించారు. ఎపిఒ మద్దిలేటి, ఇసి అశోక్, టిఎ కాంత్ పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - గోస్పాడు

రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లెల్ల గ్రామానికి చెందిన పి.మోహన్ కుటుంబానికి మండలం పోగ్రామ్ అధికారి సుగుణ శ్రీ, అడిషనల్ ప్రోగ్రాం అధికారి నాగజ్యోతి ఆధ్వర్యంలో బుధవారం ఆర్థికసాయం అందజేశారు. అన్ని గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సహకారంతో గ్రామ పెద్దలు జనార్ధన్ రెడ్డి, శేఖర్ రెడ్డి సమక్షంలో రూ.1,25,000 అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని బత్తులూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించి తన ఔనత్యాన్ని చాటుకున్నారు భూమా కిషోర్ రెడ్డి. బత్తులూరు గ్రామ ప్రజలు గ్రామంలో తాగునీటి సమస్య ఉందని భూమా కిషోర్ రెడ్డి దష్టికి తీసుకొనివెళ్లగా వెంటనే స్పందించి బోరు వేయించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భూమా కిషోర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు : ఇఒఆర్‌డి

ప్రజాశక్తి - పగిడ్యాల : పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టినట్లు ఇఒఆర్‌డి పుల్లయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రం పగిడ్యాలలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడారు. గ్రామంలోని డ్రైనేజీ కాల్వల పూడికలు తీసి శుభ్రం చేయాలన్నారు. అవసరమైతే జెసిబిని, ట్రాక్టర్‌ను ఉపయోగించి డ్రైనేజీ కాల్వలలో పూడిక తీత పనులు పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీ వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వీధిలైట్లు, నీటి సమస్య పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలంలోని ఎస్‌సి కాలనీ 9వ వార్డులో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న వీధిలైట్లు, తాగునీటి సమస్యలను వెంటనే సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మునిపాటి చిన్న మారెన్న, శ్రీశైలం మండల నాయకులు యం.మల్లికార్జున ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లడుతూ నీటి కొరత సమస్య ఎస్సీ కాలనీలో గత 20 సంవత్సరాల నుండి ఉందన్నారు. చాలా సందర్భాలలో స్థానికులు నీటి కోసం గొడవలు పడి పోలీసు స్టేషన్ దాకా వెళ్లిన ఘటనలు ఉన్నాయని చెప్పారు. 9వ వార్డులో దాదాపు 200 కుటుంబలు ఉంటున్నాయని, కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్రీశైలంలో ఎక్కడా లేని నీటి కొరత 9వ వార్డులోనే ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్లు, నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బనగానపల్లె: క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి, బనగానపల్లె సబ్ యూనిట్ క్షయవ్యాధి వైద్యులు డాక్టర్ శివశంకరుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మీరాపురం గ్రామంలో ఆరోగ్యమేళాలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా జనసమూహాలు గుమ్మిగుడి వున్న చోట క్షయవ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినపుడు తుంపర్ల ద్వార ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని తెలిపారు. కాబట్టి దగ్గినపుడు, తుమ్మినపుడు ముసుగు లేదా టవల్ అడ్డుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి నాగకుమారి, ఏఎన్ఎం విజయలక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ నరసింహ, పంచాయత్ సెక్రటరీ ప్రకాశం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు బడ్జెట్ కేటాయించాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - బనగానపల్లె : శాసనసభ బడ్జెట్ సమావేశాలలో స్కీం వర్కర్లకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు నిబంధన ప్రకారం సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్సు, ఆయా కార్మికులకు పెండింగ్ వేతనాలు 30 నెలలకు గాను కేవలం 18 నెలలు మాత్రమే ఇచ్చి 12 నెలల జీతాలు అడగకూడదని పేర్కొనడం దారుణమన్నారు.

చాగలమర్రికి చేరుకున్న మాదిగల సంగ్రామ యాత్ర

ప్రజాశక్తి - చాగలమర్రి : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్ట భద్రత కల్పించాలంటూ మహజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ ఈ నెల 1న తాడిపత్రి నుంచి ప్రారంభించిన మాదిగల సంగ్రామ యాత్ర బుధవారం చాగలమర్రికి చేరుకుంది. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామన్నారు.

ఏప్రిల్ 3, 4వ తేదిలలో విజయవాడ, హైదరాబాదులలోని బిజెపి కార్యాలయాలను ముట్టడించి మహాధర్నా చేస్తామన్నారు. అనంతరం ఈ యాత్ర కడప జిల్లాలోకి ప్రవేశించింది. కార్యక్రమంలో ఎంఎస్‌పి ఉమ్మడి జిల్లాల కన్వీనర్ ఈశ్వరయ్య మాదిగ, రాష్ట్ర నాయకుడు కత్తి ఓబులేసు, నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF PRINICIPAL JUNIOR CIVIL JUDGE : DHONE
E.P.NO.176/2022 IN O.S.NO.311/2019

Mallu Obulamma. ...Decree - Holder
V/s
Vadde Somasekhar. ...Judgment - Debtor

NOTICE UNDER ORDER 21 & RULE 22 OF C.P.C. TO J.Dr

TO
వడ్డే సోమశేఖర్ తండ్రి వడ్డే నాగరాజు,
వ్యాపారము, R/O చిన్న మల్కాపురం గ్రామం,
డోను మండలము, నంద్యాల జిల్లా.

పై నెంబరు E.P లోని D.Hr (వ్యాజ్యములో డిక్రీ అస్సైన్ చేయుట వలన తనకు ట్రాన్స్ఫర్ చేయబడినదని చెప్పుచు) దానిని అములు నెరవేర్చడమునకు ఈ కోర్టు కు మనవి చేసుకొని ఉండేటందున డిక్రీ నీ అమలు నెరవేర్చడమునకు యెందునిమిత్తము ఉత్తర్వులు ఇవ్వకూడదో మీకు తెలియజేయుటకు నీకు 17-03-2023 తేది ఉదయం 10 గంటలకు పై కోర్టు వారి ఎదుట తప్పక హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(BY ORDER OF COURT)

వాయిదా తేది : 17-03-2023

KANALA MAHESH,
Advocate for Decree - Holder,
Dhone - 518222, Nandyla Dist.
Cell No. 9441656595